నమ్మలేని నిజాలు

కొళ్ల పట్టీలు
నకిలీ మంజీరాలు
వెండి ధరలు
గాడిద కష్టం
అందని సన్మానాలు
నేతకు నేస్తం
హిందీ వివాదం
ప్రాంతీయ అభిమానం
ఐక్యతా ధ్వంసం
నవ్వుతూ ఉండు
ఆరోగ్యం బహుమెండు
కాదులే పుండు
వితండ వాదం
సత్యాసత్యాల కాండం
భౌతిక ధర్మం



- రేడియమ్
సెల్: 9291527757

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

కే సీ ఆర్ కన్న కడుపు
తిరగబడ్డ బిడ్డ !
బీ ఆర్ ఎస్ కంటి ఎరుపు
అడ్డుకున్న గుడ్డ !
నాటి నుంచి నేటి వరకు
మడిమ తిప్పనిగడ్డ !
అలా ఉన్నదిలా మారె
పంచాయతీ అడ్డ !

శ్రీనిజాలు



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ గురువారం 4-9-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:28 పేజీలు:6 వెల: రూ.1/-


### ఎక్కడ తట్ట పని, పార పని ఉన్నా పాలమూరు జిల్లా వారే కూలీలు

# చదువులో వెనుకబడడమే అందుకు కారణం



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 3:ఒకప్పుడు పాలమూరు వలసల జిల్లాగా ఉండేదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఎక్కడ తట్ట పని, పార పని ఉన్నా పాలమూరు జిల్లా వారే కూలీలని తెలిపారు. అందుకు ప్రధాన కారణం మనం చదువులో వెనకబడి ఉండటమే అని పేర్కొన్నారు. స్వరాష్ట్రం వస్తే.. అభివృద్ధి జరుగుతుందని భావించామని చెప్పుకొచ్చారు. కానీ తెలంగాణ వచ్చాక కూడా అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూసాపేట మండలం వేముల ఎస్‌జిడి కార్నింగ్ కంపెనీలో రెండవ యూనిట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు..

అప్పట్లో పాలమూరు విశ్వవిద్యాలయం కేవలం ఒక పిజి కాలేజీలా మాత్రమే ఉండిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇప్పుడు రాష్ట్రాన్ని నడిపించే అవకాశం వచ్చిందని తెలిపారు. ఇపుడు విద్యా, ఉపాధి, అవకాశాలను జిల్లా అంది పుచ్చుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పట్లో దివంగత నేత ఇందిరా గాంధీ ఎస్‌సి.ఎస్‌టి.బిసిలకు భూములు అసైన్ చేసిందని పేర్కొన్నారు. ఇపుడు చదువుకుంటేనే తలరాత మారుతుందని స్పష్టం చేశారు. మీరు చదువుకోవాలంటే కావలసిన వసతుల కల్పన బాధ్యత తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. గ్రీన్ ఛానల్ ద్వారా జిల్లా ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు.

కొడంగల్, నారాయణపేటకు ఎత్తిపోతల పథకం తెస్తే.. లెన్‌జిటిలో ఫిర్యాదు చేస్తున్నారుని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అక్కడ భూసేకరణ కోసం వెళ్తే.. రైతులు కొడంగల్లో ఇచ్చినట్లు రూ. 20 లక్షలు డిమాండ్ చేస్తున్నారని వివరించారు. కొడంగల్ పరిస్థితి వేరు.. నారాయణపేట పరిస్థితి వేరు అని స్పష్టం చేశారు. నారాయణ పేట వారికి కావాలంటే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అన్నారు. ఇక్కడ భూసేకరణ కోసం మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కలెక్టర్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ప్రతిపక్షాలు.. ఈ ప్రాజెక్టులను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నాయని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మీడియా కూడా లేనిపోని వార్తలకు అపోహలకు తావు ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ బ్రహ్మోస్ మిస్సైల్ ఉత్పత్తి చేపట్టేందుకు యత్నిస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో అడ్వా న్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లకు స్థలాలను చూపించండని కోరారు. గతంలో మన పేదరికాన్ని చూపేందుకు పాలకులు టోనీ బ్లెయిర్‌ను తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇపుడు మన అభివృద్ధిని.. ప్రాజెక్టులను విద్యా సంస్థలను చూపించేందుకు వివిధ దేశాల నాయకులను పిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

కుర్చీలో కూర్చున్న ప్రతి నాయకుడు.. ఆయనను నమ్ముకున్న ప్రజలకు మొదటి ముద్దను పెట్టాలని రేవంత్ పేర్కొన్నారు. తనకు ఏ అవకాశం వచ్చినా.. మొదటి ముద్ద పాలమూరుకు పెడతా అని ధీమా వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాష్ట్రంలో ఏ పార్టీ ఉండకూడదని చూసిన వారు.. ఇపుడు వాళ్లకు వాళ్లే కడుపులో కత్తులు పెట్టుకుని.. కౌగిలించుకుంటున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు.

తాను హరీష్ రావు, సంతోష్ రావు వెనకాల ఉన్నానని ఒకరు, కవిత వెంట ఉన్నానని మరొకరు అంటున్నారని.. ఎవరి వెనకాల తాను ఎందుకు ఉంటా.. అని ప్రశ్నించారు. తాను ప్రజల అభివృద్ధి కోసం ముందు ఉంటానని వివరించారు.

ఒకప్పుడు జనతా పార్టీ చాలా ఫేమస్.. కాల గర్భంలో కలిసిపోయిందని గుర్తు చేశారు. ఏ పార్టీ, ఎవరు శాశ్వతం కాదుని హితవు పలికారు. పాపం ఎప్పుడూ ఊరికే పోదని నొక్కిచెప్పారు. ఈ సమావేశంలో సీఎం వెంట మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

# అందుకే రాజీనామా చేశా...

## -కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, సెప్టెంబర్ 3: బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. పార్టీ అధినేత కేసీఆర్ తనపై సస్పెన్షన్ వేటు వేయడంతో.. తన నిజాయితీని నిరూపించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వివరించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కవిత మాట్లాడారు. తన ఆత్మాభి మానం కాపాడుకునేందుకు తాను ఈ పదవికి, పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. తాను చేసిన వ్యాఖ్యల వల్ల ఏదో జరిగిపోయినట్లు దుష్టచతుష్టయం ఏదో ప్రచారం చేస్తుందంటూ కవిత మండిపడ్డారు. తన విషయంలో రెండు గ్యాంగులు జరగనిది జరిగినట్లుగా ప్రచారం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ వద్దకు వెళ్లితే.. తనను గన్‌మెన్లు అడ్డుకున్నట్లు రాయించారన్నారు.

ఆరడుగు బుల్లెట్ ఈ రోజు తనను గాయపరిచిందన్నారు. సంతోష్ రావు.. చేసిన పనులతో కేటీఆర్‌కు చెడ్డ పేరు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. హరీష్, సంతోష్ మూతాలు.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో కుమ్మక్క య్యాయన్నారు. హరీష్ రావును పక్కన పెట్టుకుని.. నిజాలు మాట్లాడిన తనను బయటకు పంపాంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అన్న, నాన్నా.. వాళ్లతో జాగ్రత్త:

సొంత కుటుంబ సభ్యులపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. మాజీ ఎంపీ సంతోష్ రావును టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. సంతోష్ రావుకు ధన దాహానికి అడ్డు అదుపు లేదని.. సిరిసిల్ల ఇసుక లారీ కేసులో దళితులను టార్చర్ చేసింది సంతోష్ అనే అన్నారు. చేపించింది ఒకరైతే చెడ్డ పేరు మాత్రం కేటీఆర్ కు వచ్చిందని అన్నారు.

సంతోష్‌కు ఎమ్మెల్యే పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి అనుచరుడు అని తనకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చెప్పారని కవిత అన్నారు. రూ. 750 కోట్ల విల్లా ఎక్కడిదితనికి... నవీన్ రావుకు ఎమ్మెల్సీ పదవి ఎలా వచ్చింది.. అని ఆమె ప్రశ్నించారు. హరీష్ రావు, సంతోష్ రావులు తలో వర్గం మేంటేయిన్ చేస్తూ కాంగ్రెస్, బీజేపీలతో కుమ్మక్కై బీఆర్ఎస్ ను ఓడిపోయేలా చేశారని సంచలన ఆరోపణలు చేశారు.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేలా చేసిన వ్యక్తులు ఈ ఇద్దరే అని మండిపడ్డారు. హరీష్ రావు మీడియాను మేనేజ్ చేస్తే, కేటీఆర్ యూట్యూబ్ ను మేనేజ్ చేస్తారని అన్నారు. హరీష్ రావు చేస్తున్న రాజకీయం చూసి నేర్చుకోవా లని కేటీఆర్ కు హితవు పలికారు. ఈ ఇద్దరినీ పార్టీలో ఉంచుకుంటే మిమ్మల్ని కూడా మింగేస్తారని కేసీఆర్ కు సూచించారు. వీరితో జాగ్రత్తగా ఉండాలనికేటీఆర్, కేసీఆర్ లకు ముందస్తు జాగ్రత్తలు చెప్పారు కవిత.

## అమ్మకు దూరం.. కన్నీటి పర్యంతం

రెండు దశాబ్దాల పాటు పార్టీ కోసం కష్టపడి పని చేస్తే.. చివరకు తనకు సస్పెన్షన్ దక్కిందంటూ ఎమ్మెల్సీ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. వివరణ కూడా కోరకుండా తనపై సస్పెన్షన్ వేటు వేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న సమయంలో తాను పార్టీ కోసం, తెలంగాణ కోసం మాత్రమే కష్టపడ్డానని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. అమ్మకు కూడా దూరంగా ఉండాల్సి రావడం బాధగా ఉందన్నారు. అయితే తాను ఏ పార్టీలో చేరాలని అనుకోవడం లేదని స్పష్టం చేశారు.

తనకు ఏ పార్టీతో పని లేదని కుండ బద్దలు కొట్టారు. జాగృతి కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడిన తర్వాతే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానన్నారు. బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకోవాలనే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

# గని ప్రమాద ఘటనల్లో కారుణ్య వారసులకు గ్రేడ్-3 క్లర్క్ పోస్టులు



ఖమ్మం, సెప్టెంబర్ 3: గని ప్రమాదాల్లో మరణించిన ఉద్యోగుల వారసులకు ఇచ్చే కారుణ్య నియామకాల్లో పట్టభద్రులైన అభ్యర్థులకు క్లరికల్ గ్రేడ్-3 పోస్టులను ఇవ్వడానికి సింగరేణి యాజమాన్యం అంగీకరించింది. ఈ మేరకు గుర్తింపు కార్మిక సంఘంతో జరిగిన 51వ నిర్మాణాత్మక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో త్వరలోనే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ తో యాజమాన్యం ద్వైపాక్షిక ఒప్పందం, అనంతరం డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో త్రైపాక్షిక ఒప్పందం చేసుకోనుంది.

గతంలో ఈ విద్యార్హత కలిగిన వారు జనరల్ అసిస్టెంట్‌గా మాత్రమే పనిచేసే అవకాశం ఉండేది. అయితే 2009లో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం టెక్నికల్ డిగ్రీలైన మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్, డిప్లొమా (మైనింగ్/ మెకానికల్ /ఎలక్ట్రికల్), ఐటీఐ (ఎలక్ట్రికల్/ఫిట్టర్/వెల్డర్) కోర్సులు పూర్తి చేసిన వారికి విద్యార్హతలకు తగిన ఉద్యోగాలు కల్పించడానికి అంగీకరించారు. తాజాగా డిగ్రీ అర్హతను కూడా చేర్చి గ్రేడ్ -3 క్లర్క్ ఉద్యోగాలను కల్పించడానికి నిర్ణయించడం జరిగింది. అయితే ఒకవేళ మరణించిన ఉద్యోగి కుటుంబంలో అర్హులైన టెక్నికల్ డిగ్రీ ఉన్న వారసులు లేనిపక్షంలోనే డిగ్రీ అర్హత ఉన్న వారిని గ్రేడ్ 3 క్లర్క్ పోస్టు అభ్యర్థిత్వానికి పరిశీలించడం జరుగుతుంది.

# ట్రంప్ టారిఫ్స్ వేళ రష్యాతో భారత్ మరో భారీ డీల్..?

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3:అమెరికాతో టారిఫ్స్ యుద్ధం, పాక్‌తో ఉద్రిక్తతల వేళ భారత రక్షణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన గగనతల రక్షణ వ్యవస్థగా పేరుగాంచిన ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్ అదనపు యూనిట్స్‌ని రష్యా నుంచి మరిన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధమైంది. ఈ విషయమై మాస్కోతో చర్చలు ప్రారంభించింది. ఈ మేరకు రష్యా అధికారులను ఊటంకిస్తూ అక్కడి మీడియా వెల్లడించింది. భారత్ అదనపు ఎస్-400 వ్యవస్థల కొనుగోళ్లకు రష్యా తో చర్చలు జరుపుతున్నట్లు పేర్కొంది.

భారత్ ఇప్పటికే ఎస్-400 వ్యవస్థలను ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే పాకిస్థాన్‌తో ఘర్షణల సమయంలో ఈ ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసింది. పాకిస్థాన్ డ్రోన్లు, మిసైల్స్‌తో దాడికి ప్రయత్నించగా ఎస్-400 సహాయంతో వాటిని భారత్ విజయవంతంగా కూల్చివేసింది. సరిహద్దుల్లో మోహరించిన ఎస్-400 మిస్సైల్ సిస్టమ్ అడ్డుకున్న విషయం తెలిసిందే. ఖచ్చితత్వంతో సరిహద్దు నుంచి వైమానిక ముప్పును ఎదుర్కోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పని చేసిన నేపథ్యంలో.. భారత్ తన వైమానిక రక్షణ సామర్థ్యాన్ని మరింత విస్తరించేందుకు నిర్ణయం తీసుకుంది.

చైనా నుంచి పెరుగుతున్న సైనిక ముప్పును ఎదుర్కొనే లక్ష్యంతో ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు రష్యాతో ఇండియా 5 బిలియన్ల డాలర్ల ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ ఒప్పందం 2018లో కుదిరింది. ఈ ఒప్పందం కింద మొత్తం ఐదు ఎస్-400 వ్యవస్థలను కొనుగోలు చేయాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల సరఫరాలో జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో భారత్‌కు ఇవ్వాల్సిన మిగిలిన రెండు యూనిట్లను 2026 లోగా అందజేసేందుకు కట్టుబడి ఉన్నామని రష్యా ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఎస్-400 ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్ అదనపు యూనిట్స్ కోసం రష్యాతో భారత్ చర్చలు ప్రారంభించింది.

# 20 మంది మావోయిస్టులు లొంగుబాటు



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 3: ఛత్తీస్‌గఢ్ లోని సుక్మా జిల్లాలో బుధవారం దాదాపు 20 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు.

వారిలో తొమ్మిది మంది మహిళలు ఉన్నారు. లొంగిపోయిన వారిలో 11 మందిపై రూ.33 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ తెలిపారు. వీరంతా గతంలో అనేక విధ్వంసక ఘటనల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టులందరికీ ఒక్కొక్కరికి ప్రభుత్వ సాయం కింద రూ.50 వేలు అందించారు. అంతేకాదు వారికి పునరావాసం కల్పిస్తామని ఎస్పీ తెలిపారు.

# హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, సెప్టెంబర్ 3: ఈ నెల 6వ తేదీన గణేశ్ నిమజ్జనానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. హుస్సేన్ సాగర్, ట్యాంక్ బండ్ వద్ద జరిగే గణేశ్ నిమజ్జనానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భక్తులను ఆయా ప్రాంతాల నుంచి హుస్సేన్ సాగర్, ట్యాంక్‌బండ్‌కు తరలించేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది.

చార్మినార్ డివిజనల్ పరిధిలోని బర్కత్‌పురా, ముషీరాబాద్, ఫలక్‌నుమా, కాచిగూడ, మెహిదీపట్నం, రాజేంద్రనగర్ డిపోలు, హయత్‌నగర్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్, హయత్‌నగర్-1,2, మిథాని డిపోల నుంచి నిమజ్జనం కోసం ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.కాచిగూడ, రాంనగర్ నుంచి బషీర్‌బాగ్ వరకు, కొత్తపేట, ఎల్‌బీనగర్, వనస్థలిపురం, మిథాని నుంచి ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వరకు, జామై ఉస్మానియా నుంచి ఇందిరా పార్క్, గచ్చిబౌలి, లింగంపల్లి, రాజేంద్రనగర్ నుంచి లక్డీకాపూల్, పటాన్‌చెరు నుంచి లింగంపల్లి, ఆఫ్జల్‌గంజ్ నుంచి ఆలిండియా రేడియో వరకు బస్సుల రాకపోకలు కొనసాగించనున్నాయి.

# జీవాల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

**- డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్ 3: జీవాల ఆరోగ్యం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాడి పరిశ్రమను పోషించుకుని జీవనం సాగించే రైతులకు మంచి ఆదాయం ఉంటుందని చెప్పారు.గొర్రెలు, మేకల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జీవాలకు, పశువులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తారని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది కృష్ణమూర్తి, శ్రీను, బాలరాజ్, సుధాకర్, రైతులు తదితరులున్నారు.

# గణేష్ నిమజ్జన శోభాయాత్రకు ఏర్పాట్లు పూర్తి : ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ, సెప్టెంబర్ 3:నలగొండ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 5వ తేదీ శుక్రవారం నిర్వహించే గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ యంత్రాంగం ముందస్తు భద్రతా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని అన్ని ప్రధాన రహదారులతో పాటు వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సీసీ టీవీ కెమెరాలతో పాటు ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి జిల్లా పోలీస్ కార్యాలయానికి అనుసంధానం చేసినట్లు చెప్పారు. నల్లగొండ పట్టణ కేంద్రంలో 9 అడుగుల లోపు విగ్రహాలు నల్లగొండ పట్టణంలోని వల్లభరావు చెరువు వద్ద నిమజ్జనానికి ఏర్పాటు చేయడం జరిగిందని, 9 అడుగులకు పైబడిన విగ్రహాలు 14వ మైలు రాయి (అలీ నగర్) వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# కలకలం రేపిన తెగిన మహిళ తల.. భర్త అరెస్ట్

ముంబై, సెప్టెంబర్ 3:ఒక ప్రాంతంలో మహిళ తెగిన తల కనిపించింది. స్థానికంగా కలకలం రేపిన ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేశారు. భార్యను హత్య చేసి మృతదేహాన్ని ముక్కలుగా నరికి పడేసిన నిందితుడైన భర్తను అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని భివాండిలో ఈ సంఘటన జరిగింది. నగరంలోని ఈద్గా కాంప్లెక్స్ సమీపంలో మహిళ తెగిన తల కనిపించింది. ఇది చూసి స్థానికులు భయాందోళన చెందారు.

కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకున్నారు. హతురాలి వయస్సు 25 నుంచి 28 ఏళ్ల మధ్య ఉంటుందని అంచనా వేశారు. నరికి పడేసిన మహిళ తలను పోస్ట్‌మార్టం కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మరోవైపు ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంట్లో గొడవల కారణంగా భార్యను భర్త దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని ముక్కలుగా నరికి పలు చోట్ల పడేసినట్లు దర్యాప్తులో తెలుసుకున్నారు. నిందితుడైన భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ మహిళ మిగతా శరీర భాగాల కోసం వెతుకుతున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# సంగారెడ్డి జిల్లాలో ఘోరం.. ఆవు దూడను చంపిన చిరుత పులి

సంగారెడ్డి, సెప్టెంబర్ 3: సంగారెడ్డి జిల్లాలో చిరుత పులి సంచారం కలకలం రేపుతోంది. సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్ గ్రామ శివార్లలోకి ప్రవేశించిన చిరుత పులి.. ఓ ఆవుదూడపై దాడి చేసి చంపింది. ఈ ఘటనతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు.కడ్పల్ గ్రామానికి చెందిన రైతు తుకారాం తన పంట పొలంలోని ఓ రేకుల షెడ్డులో ఆవు దూడను కట్టేశాడు. అయితే మంగళవారం రాత్రి ఆ షెడ్డు వద్దకు చేరుకున్న ఓ చిరుత పులి ఆవు దూడపై దాడి చేసి చంపింది. బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతు తుకారాం.. చనిపోయిన ఉన్న ఆవును చూసి షాకయ్యాడు. పోలీసులకు, అటవీశాఖ అధికారులకు తక్షణమే సమాచారం అందించాడు రైతు.

# నిరుపేదలందరికీ ఆహార భద్రత : అంకతి సత్యం



నల్గొండ, సెప్టెంబర్ 3: నిరుపేదలందరికీ ఆహార భద్రతే ప్రభుత్వ లక్ష్యమని నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. మండలంలోని మార్లగడ్డ క్యాంప్, మారుతీవారిగూడెం పంచాయతీల్లో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన చౌక ధరల దుకాణాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు రేషన్ దుకాణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముంగి శివ మారయ్య, కొండా శ్రీనివాసరెడ్డి, అంకతి కృష్ణయ్య, బుర్రి వెంకన్న, మార్తి సురేందర్ రెడ్డి, దోరెపల్లి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

## చురక

తన తండ్రి ఇమేజీకి
తెచ్చిరంట పెద్ద మరక
గులాబీ బాసు బిడ్డ
గుట్టువిప్పి చేసె ఎరుక.
అవినీతి కాళేశ్వరం
అనకొండల పేర్లు చెప్పే
ఆరోపణ లోని నిజం
ఆంతర్యం కట్టువిప్పె



-వేల్పుల నారాయణ
9440433475

## నేటి కందం- నేటికి అందం



ప్రాకటముగ శాంతి కొరకు
భీకరముగ కృషి నొనర్చు విజ్ఞుడు మోడీ
తేకువతో పోరు సలిపె
పాకు సమక్షమున నుగ్రవాదము పైనన్ !!

(పాక్ అధ్యక్షుని సమక్షంలోనే "ఉగ్రవాదం పై తగ్గేదేలేదు" అని మోడీ ప్రపంచ నేతల చప్పట్ల మధ్య ప్రకటించి పాకిస్థానుకు గట్టి వార్నింగ్ ఇచ్చారు)



-రాధశ్రీ
సెల్:9494481210


ప్రేమ సేవ

చిమ్మపూడి ఫౌండేషన్

యువకవి సమ్మేళనం &
'యమునా విప్లవ కుమారులు' గ్రంథావిష్కరణ

తేది: ఆదివారము 14-09-2025, ఉ॥ 9-30 ని॥లకు
వేదిక : శ్రీ కళాసుబ్బారావు కళావేదిక, త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాదు.

ముఖ్య అతిథి, గ్రంథావిష్కర్త
డా॥ కె.వి. రమణాచారి గారు (IAS Rtd.)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు &
చిమ్మపూడి ఫౌండేషన్ గౌరవ సలహాదారులు

సభాధ్యక్షులు :
శ్రీ బైస దేవదాసు గారు
'నేటినిజం' పత్రిక సంపాదకులు

విశిష్ట అతిథి :
శ్రీ మౌనశ్రీ మల్లిక్ గారు
ప్రముఖ కవి, సినీ టీ.వీ., గీత రచయిత

ఆత్మీయ అతిథి :
శ్రీమతి విశ్వైక గారు
ప్రముఖ కవయిత్రి, సినీ గీత రచయిత్రి

గ్రంథ రచయిత :
శ్రీ పాలకోడేటి కృష్ణమూర్తి గారు
'యమునా విప్లవ కుమారులు' గ్రంథ రచయిత

గ్రంథ సమీక్షకులు :
శ్రీ ప్రతాప వెంకట సుబ్బారాయుడు గారు
ప్రముఖ రచయిత

సభాసమన్వయ కర్త :
శ్రీ చిమ్మపూడి శ్రీరామమూర్తి గారు
అధ్యక్షులు, చిమ్మపూడి ఫౌండేషన్

వచన కవితారచన పోటీలలో విజేతలైన పలు పాఠశాలల విద్యార్థులకు నగదు బహుమతి ప్రదానం.

యువ కవి సమ్మేళనంలో పాల్గొను కవులు, కవయిత్రులు
ఇంద్రావత్ రాహుల్ నాయక్, ఉప్పల లింగ, ముడావత్ లోకేందర్, పెద్దింటి శేషులక్ష్మణ్, మాచర్ల శివప్రసాద్, మధు అమరగాని, మిద్దె సురేశ్, దేవులపల్లి రమేశ్. డా॥ రమ్య, భాను తేజశ్రీ, గీతానారాయణ రావు, మేఘన శివాని

కళా శారదాదీక్షితులు
కార్యదర్శి
త్యాగరాయ గాన సభ

ఆహ్వానించువారు
చిమ్మపూడి ఫౌండేషన్ కార్యవర్గం

1975లో రాసిన కథ

నాటి తరం వారి కథలు నేటి తరానికి
## కథల వంతెన

# కష్టేఫలిః?



ఎండాకాలం

ఎండమండిపోతున్నది చిగిరించిన చెట్లన్నీ సూర్య రశ్మికాగలేక తలలు వంచుకున్నాయి.

"అమ్మా ఒక ముద్ద తల్లీ"

"మారాజులు! పండంటి కొడుకు పుడుతాడు తల్లీ"

"మీ యిల్లు బంగారంగాను, అమ్మా! ముద్దేయమ్మా!"

చింపిరిజుట్టు, చిరిగిన అంగి, చేతికి కడియాలు, అతనివేషం అదోవిచిత్రంగా వుంది. ఊర్లో పిల్లలంతా గుమికూడారు. అతని ముఖంలో ఏదో ఆశ ఎదురుచూస్తున్నది. మళ్లీ "అమ్మా ఒక ముద్ద తల్లీ" అంటున్నాడు. ఎదురుగా బుర్రమీసాలాయన వచ్చేసరికి వాని ఆశ యింకా పెరిగింది. 'ఒక దోతి ఇయ్యి దొర! ప్రక్క ఊర్లోయిస్తే చినిగిపోయింది". చొక్కా చూయిస్తున్నాడు. "మీ యిల్లు బంగారంగాను.." టేపురికార్డులా చెప్పేస్తున్నాడు.

సుందరరామయ్య అరుగుమీద కూర్చున్నాడు. అరుగంటే ఆ వూరికి సింహాసనమన్న మాట! సుందరరామయ్య గారి ఇల్లు మూడంతస్తుల బంగళా! జానపద సినిమాలోని కోటలాగుంటుంది. ఆ వూర్లో సగభాగం ఆక్రమించి ఉందనే చెప్పాలి. సుందరరామయ్యది భారీ విగ్రహం. దానికి తోడు ఆయన పంచెకట్టు. లాల్చి, చేతిలో కర్ర బుర్రమీసాలు చూసేవారికి హడలుగా ఉంటాయి. సుందరరామయ్య ఇంట్లో నుండి రాగానే "పిచ్చాపాటి" చెప్పకుంటున్నవారంతా దండాలు దొరా! అని ఒక్కసారి లేచి నిలబడ్డారు.

"బాబూ ప్రొద్దు పోయిందినాయనా! ఒక్క ముద్దేయించండి బాబూ" అంటూ ప్రొద్దుకేసి చూస్తున్నాడు బిక్షగాడు.

"నీ పేరేమిటోయ్?" చుట్ట కాల్చి తుపుక్కున ఉమ్మాడు. పుగాకునిప్పుకోసం ఓ మనిషిని పురమాయించాడు.

"వీరయ్యండి!"

"ఇదో ఈ అరుగు దగ్గరికి రా!"

అతను వచ్చాడు

"కూర్చో!"

"బాబు మాకు నిలబడే అలవాటే లెండి! ఏదో నాయనా మీ పాదాల క్రింద బ్రతికేవాండ్లం" అంటున్నాడు. రెండుగంటల నుండి నిలబడ్డ తనకు కూర్చోవాలనే వున్నా మర్యాద కోసం బ్రతుక్కోసం

"ఏవూరు?"

"రంగజెట్టిపాలెం". సరిహద్దులు కూడ అడక్కుండానే చెప్పేశాడు.

ఏంపనిచేస్తావేమిటి.

తనవేషం చూసినా ఇంకా గుర్తు పట్టలేదా? అడుగాలనే హేళనకాదు గదా!

"ఏదో.. ఇదేనండి అడుక్కతినటం" తేలికగా అనేశాడు.

"ఓ మాట చెపుతా ఇంటావు" చుట్ట తీసి అరుగుమీద పెట్టాడు.

"అయ్యా! వినయంగా అన్నాడు వీరయ్య"

"చూడు, నీవంటి వాళ్లు కష్టం చేసి బ్రతక గల్గెవాళ్లు అడుక్కుతింటే దేశం ఏమయిపోతుంది చెప్పు! అదీగాక ప్రతివానికి ఇదో అలుసయి పోయిందోయ్. కష్టంచేసే వాల్లంతా సోమరిపోతుల్లా తయారయితే అసలు కష్టపడే దెవడోయ్! మనమంతా కష్టం చేసిననాడే గదా దేశం బాగుపడేది. గాంధి కలలుగన్న గ్రామరాజ్యం రామజ్యాం ఏది! ఏదంటా! కుంటివాడు గుడ్డివాడు దానము ధర్మము అంటే అదో లెక్క! నీపేరేమన్నావు.. వీరయ్యా!... చూడు సలక్షణంగా కష్టం చేసి నలుగురిని పోషించగలవు. నీకెందుకీ పాడు బుద్ధీ! సుందరరామయ్యకు చుట్టకు నిప్పురావటంతో ఉపన్యాసం ఆగిపోయింది.

వీరయ్య ముఖంలో రంగులు మారాయనే చెప్పాలి.

"చూడు, నీవంటి వాళ్లు కష్టం చేసి బ్రతక గల్గెవాళ్లు అడుక్కుతింటే దేశం ఏమయిపోతుంది చెప్పు! అదీగాక ప్రతివానికి ఇదో అలుసయి పోయిందోయ్. కష్టంచేసే వాల్లంతా సోమరిపోతుల్లా తయారయితే అసలు కష్టపడే దెవడోయ్! మనమంతా కష్టం చేసిననాడే గదా దేశం బాగుపడేది."

"నాకు పనిఎవరిస్తారు దొరా!" అన్నాడు బిక్కుబిక్కుమంటూ..

"ఓ అదటోయ్ నీభయం, నీకు పని ఒకరియ్యాలంటోయ్, నీకు పని.. స్వతంత్ర భారతంలో అహహా..."అని నవ్వాడు.

అక్కడవున్న వందిమాగదులంతా నవ్వారు! వాళ్లకే మర్థమయిందో వీరయ్యకు అర్థం కాలేదు.

"చూడు, అటు బోతే అడవి, కట్టెలు కొట్టి, అమ్ముకోవచ్చు, అదో చెరువు, అందులో చేపలు.. సాయంత్రానికి రెండు రూపాయలు వేళ్లమీద లెక్కపెట్టి సంపాదించవచ్చునోయ్ ప్రకృతి సంపదను వాడుకోవడం వెధవది మనవాళ్ళకు తెలువదు అదీ వేరేదేశాలల్లో నయితేనా..."

వీరయ్యకు కాళ్లు తీపులు పుట్టాయి. అటు ఇటు నుసుల్తున్నాడు.

"ఇది భారతమోయ్ స్వతంత్ర భారతం, మా బోటోల్లం ఆ రోజుల్లో గాంధి వెంట ఎన్ని సత్యాగ్రహాలు చేశాం ఏమో!" అసలు సుందరరామయ్యకు గాంధీ ఎవరో మొన్నటి వరకుతెలువదు. పెద్దల్లుడు ఖాదీబోర్డు చైర్మన్ అయ్యాక ఓ గాంధీ బొమ్మను తెచ్చి మామగారింట్లో ఒక కొయ్యకు వేసి ఇది గాంధి శతజయంతని, గాంధీనామస్మరణ చేస్తే వచ్చేసారన్నా ఏదో పదవి తప్పదని మరీ చెప్పి పోయాడు. నాటి నుండి రామయ్యగారు ప్రతి మాటలో గాంధి గారిని ఘనంగా చెప్తున్నాడు.

"ప్చ్! నీకు చెబితే ఏమిలాభం! ఒసే లక్ష్మీ! ఇంతగంజి తెచ్చిపొయ్యి" అన్నాడు నిట్టూరుస్తూ. వీరయ్య కిదంతా అయోమయంగా తోచింది. ఇంతపెద్ద మేడ. ఇంతమంది జనం. ఇంతమంది పాలేర్లు. కనీసం రెండుశేర్ల గింజలన్నా బిక్షం దొరుకుతుందనుకున్నాడు. అదీగాక ఈయన చెప్పిన ప్రతి దానికి అయ్యా! దొరా! యని ఎంతోవినయంగా తలూపాడు. పేగులు గర్రుమంటున్నా లేనిచిరునవ్వు ప్రదర్శించాడు. 'ఇంకోచోట అయితే కనీసం అయిదుశేర్ల గింజలు వచ్చేవి. తన పదేండ్ల సర్వీసులో ఇంత తక్కువ ఆదాయం ఒక్కపూట కష్టం, గంజి...' అతనిమనసు బాధగా మూల్గింది. నెత్తి గొక్కున్నాడు, గంజి త్రాగాడు. "ఇదిగో" సుందరరామయ్యగారి పిలుపు "పిచ్చివేసాలు వెయ్యక ఈ వూర్లో యింకెవ్వరి ఇంటికి పోకు" ఆర్డర్ జారీ చేశాడు. "ఏదో ఓపని చెయ్యి, ప్రతిఫలం దొరక్కపోదు. కష్టేఫలిః దొర మాటంటే మాటామజాకా" అనుకుంటూ వెళ్లారు.

వీరయ్య సుందరరామయ్యను ఆ ఇల్లు దాటగానే నానాబండభూతులు తిట్టాడు. "గొడ్డుముండా కొడుకు.. పిసినారి ముండా కొడుకు..." అతని కండ్లలో నీరు కమ్మాయి. ఇల్లు దాటగానే జనమంతా వీరయ్యకు వంతపాడారు.

×××

ఆ ఊళ్లో కట్టెలు కొనే స్తోతమత సుందరరామయ్యకు తప్ప వేరేవానికి లేదని తెలుసుకున్న వీరయ్య కట్టెల మోపుతో వచ్చి రామయ్య ఇంటిముందు కూర్చున్నాడు. 'దొర ఎంతో సంతోషిస్తాడు పదేళ్ల బిక్షకజీవితాన్ని ఈ రోజు వదిలేశాడు. తనకు ఊర్లో ఓ గుడిశయినా ఇప్పించొచ్చు. అతను చెప్పినట్లు వింటే కొందరికి భూదానాలు జరిగాయని కూడా విన్నాడు'. కట్టెల మోపుకు ఎంత వస్తుదో అంనా వేసుకుంటు న్నాడు. 'దొర కాస్త ఎక్కువ ఇస్తాడులే. దొర పగలు నిద్రలేవలేదేమో!' అతని మనస్సు ఉరకలేస్తుంది.

రామయ్య పొడిదగ్గుతో వీరయ్య ఈలోకంలోకి వచ్చాడు.

"ఓరేయ్ వీరయ్యా!" ముసిముసి నవ్వు నవ్వుతూ కట్టెలకేసి చూస్తున్నాడు.

వీరయ్యకు పట్టరాని ఆనందం కలిగింది.

"ఆమోపు యిటు పట్టుకరా"

వీరయ్య మోపు తెచ్చి సుందరరామయ్య ముందుంచాడు.

"ఓరేయ్ రంగడూ" గద్దించి పిలిచాడు ఇంట్లోకి చూస్తూ.

"వస్తి దొర!" అంటు వచ్చాడు.

సుందరరామయ్య లేచాడు. కట్టెల మోపును కాలుతో అటు ఇటు దొర్లించాడు అతని ముఖం కోపంతో ఎర్రబారింది.

"ఈ కట్టె లెక్కడివిరా! రంగా"

"ఆ దొరా!" అతని ముఖం వేపుచూసి నసిగాడు.

"ఏంరా! గాడిద! మనవేగదరా. మొన్న తూర్పు గెట్టులో కొట్టించి ఆరబెట్టిన కట్టెలు గాదురా యివి"?

"అవుదొర, మన పొలంలోవె' వంత పలికాడు.

వీరయ్యగుండెలో గుభేల్మంది. అంతా అయోమయం. ఇంతసేపు చేసిన కష్టం గొడ్డలి లేక చేతితో విరిస్తే తగిలిన దెబ్బలు.. ప్రొద్దస్తమానం గుట్టల మీద తిరిగి కాల్లకు బొబ్బలు.

"దొరా! యివి అడవి కట్టెలు దొరా!" అన్నాడు వీరయ్య ధైర్యం కూడగట్టుకొని.

"ఓరేయ్ ఆ కట్టె యిటందుకో"

రంగడు అటుఇటు చూస్తున్నాడు

"సరే ఉండు" అంటూ మోపులో ఓ కట్టె గుంజుకొని వీరయ్య వీపుమీద ఓ దెబ్బవేశాడు. "పిచ్చి వేషాలు వేయక చెప్పరా!" అరుస్తున్నాడు.

వీరయ్య చినిగిన చొక్కా కాస్తా పేలికలయింది. ముండ్ల కట్టె మూలాన శరీరంలోంచి రక్తం వస్తున్నది.

"లేదు సామి! నా కాళ్ల బొగ్గలు చూసయినా! నా మాట నమ్ముదొరా!'' ఏడుస్తున్నాడు.

"దేశదిరుగుడు ముండాకొడుకులకు బొగ్గలు రాకేంచేస్తాయి. నీనాటకం నా ముందా!" కూచున్న వాన్ని ఓతన్ను తన్నాడు.

"చస్తిదొరా... నీకాలు మొకుతా.. నీ బాంచ..."

"చావులంజ.. నీయబ్బ సొమ్మనుకున్నావురా!" కట్టెతో యింకోటి వేశాడు. వీరయ్య లేచి ఉరుకుతున్నాడు. "ఓరేయి దొంగ ముండాకొడుకా, మల్లీ పొలిమెర్లో అడుగుపెడితివా దొక్క చీల్చి డోలు..." రంగడు కట్టెల మోపు రామయ్య ఇంట్లో వేశాడు.

ఓరేయ్ ఎవర్రా! ముదనష్టులు, "దూపయితుంటే ఒక్కడూ చావేరేం!"

ఊగిపోతున్నాడు రామయ్య. మూడురోజుల నుండి అమ్మగారు కట్టెలు లేవంటే ఒక్కడయినా వింటేనా!



-మేరెడ్డి యాదగిరిరెడ్డి
9949415798





నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

**తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..**

## ఈ లోకం

ఈ లోకం జీవుల లోకం
ఈ లోకం జీవులవాసం
ఈ లోకం కర్మల కారావాసం
ఈ లోకం జీవనర భూలోకం!

ప్రకృతి పంచభూతములు
జీవుల జీవన ఆలంబనలు
ఆకలి దప్పులు పుట్టుట గిట్టుటలు
ఈ లోకానికి దేవుని శాపాలు!

రాత్రి - పగలుల లోకం
కనులు మూసి తెరిచే లోకం
కన్నులు తెరిస్తే జననం
కన్నులు మూస్తే మరణం!.

ఉరుకుల పరుగుల లోకం
కాగితపు కాసుల చుట్టు ఈ లోకం
కరువుకాటకాల శోక బాధల లోకం
కరెన్సీ తింటే కడుపు నిండని లోకం.

ఈ లోకం అందమైన వ్యాపారం
ఎవ్వరి వేషం వారికి ఆధారం
ఎంత నటిస్తే అంత బేరం
వినియోగ దేవుళ్ళదే మోసే భారం!.

అంతా వయసు మయం
ఒక్కొక్కరికి ఒక్కో సమయం
సమయం అయిపోయాక ఖాళీ పాత్రలే
బక్కపడ్డ పులిచారల గొప్పదనా లే!.

ఈ లోకం యంత్ర మయం
అంతా భస్మాసుర హస్త మయం
నిత్యం విశ్వ శోధనల మయం
ఆదమరిస్తే అంతా బూడిద మయం!.

యంత్రం మొరాయిస్తే అంతరాయం
అంతలోనే అంతా రయం రయం
విద్యుత్ ఉంటే స్వర్గ మయం
విద్యుత్ లేకుంటే నరకప్రాయం !.

ఈ లోకం అంతా వింతల మయం
తలుచుకుంటే మనసులో భయం
కాళ్ళ కింద అగ్ని గోళం బడబానలం
పైన రాలిపడే ఉల్కా గ్రహాగోళ మయం!

-పట్లొళ్ళ బక్కారెడ్డి
9705315250

## విజయం

ఇది నా విజయమే అనుకుంటారు.
విజయపథకాలు చేజిక్కించుకున్న.
కొందరు విజయాలు నావేనని
సమిష్టి కృషిని మర్చి.
ఆ విజయాల తెర చాటున.
ఎన్నెన్ని మేధస్సులు
నిరంతర చింతనలో
మునిగి తేలినాయో ?.
అనేక దేహపు సూక్ష్మ రంధ్రాలు.
శ్వేదాన్ని చిమ్మినాయో ?
ఎన్నెన్ని ధమనులు సిరలు.
గుండె కవాటాలకు అవిశ్రాంతంగ.
రుధ్రపు ప్రవాహాలను కొనసాగించాయో!
ప్రగతికి శక్తి సోపానాలు పర్చుకుని.
శిరస్సు శిఖర భాగాన్ని చేరడానికి.
అడుగులు సారించినప్పుడల్ల యెదనిండ
ఊపిరి బిగబట్టి.
పిక్కల్లో బలాన్ని
కూడదీసుకున్నావో
కన్నీటిని పన్నీరుగ మార్చరానికి
ఎన్నెన్నోచేతులు చేయుతనిచ్చి
సహాయపడినవో
ఎన్నెన్నినాలుకలు
జేజేలు పలికినవో
ఎన్నెన్నో హృదయాలు.
తాపత్రయపడి మనసులను విశాల
పరచుకొని వారు చేసే పని ఫలప్రదం
కావాలని ప్రార్థించినాయో!
ఏ విజయమైన ఏ ఒక్కరితో.
సఫలీకృతం కానే కాదు.
సమిష్టి కృషి ఫలితమే.
ప్రతి విజయం కేతనం ఎగిరేసేది .

-యరకల యాదయ్య.
9866468979

## వాట్సప్ - ఫేస్‌బుక్

పద్య కవిత గేయ ప్రక్రియ ఏదైన
వాటుసపును జేరి వాసికెక్కు
కవిత లోపల పస కన్నుగుచ్చిన లేదు
కనుము వినుము దారి కందుకూరి.
పొగడ వలెనుకుంటె పొగిడించు కోమంటె
ఫేసు బుకును చూడు ప్రేమ మీర
ఉబ్బిపోయి నీకు ఊపిరి బిగవట్టు
కనుము వినుముదారి కందుకూరి.

-కందుకూరి శ్రీరాములు
సీనియర్ తెలుగు లెక్చరర్
తపస్య డిగ్రీ కాలేజ్ సికింద్రాబాద్

## సహస్ర "దుఃఖం"

అమ్మాయి పేరు ఎంత బాగుందో " సహస్ర !!"
వేయి మంచి గుణాలున్న బిడ్డ అని అర్థం !
సహస్ర అంటే వెయ్యి సంవత్సరాలు కాదు--
అమ్మాయి వంద సంవత్సరాలైనా బతుకలే
సహస్రనామాలు జపిస్తుంటేనూ
ఎవరికైనా ఈ బిడ్డనే యాదికొస్తుంది కదా
ఏం దేవుడూ అనిపిస్తుంది కడుపు కోతగా!.
తల్లి తండ్రులు పిల్లలను క్రమశిక్షణగా పెంచకపోతే
ఇలాంటి సహస్రలు హత్యగా అల్పాయుష్కులే
మీ పిల్లలను జాగ్రత్తగా నేరాల ఆలోచనలు
రాకుండా పెంచండ-
భవిష్యత్తు సహస్రలను రక్షించండి.
లేకుంటే బాల నేరస్థులతో
భారత దేశం నిండిపోయింది !!
( ఇటీవల జరిగిన ఘోరకలి "సహస్ర" హత్యకు స్పందించి)

-కందాళై రాఘవాచార్య

## నీ ఇష్టం!

గరిక నీకు ఇష్టం
గందరగోళం మాకిష్టం
ఉంద్రాళ్ళు నీకు ఇష్టం
ఉద్రేకం మాకు ఇష్టం.
దీపారాధన నీకు ఇష్టం
డీజే డ్యాన్సులు మాకు ఇష్టం
చందనం నీకు ఇష్టం
చందా వసూలు మాకు ఇష్టం.
పంచామృతం నీకు ఇష్టం
పచ్చిమద్యం మాకు ఇష్టం
ఆచారం నీకు ఇష్టం
అపచారం మాకు ఇష్టం
ఊరంతా కలిసి మొక్కడం నీకు ఇష్టం
వీధికి రెండుగా
చీలిపోవడం మాకు ఇష్టం
మన్నిస్తావో మారుస్తావో ఇక నీ ఇష్టం
మాకైతే ఇదే ఇష్టం.
బానిసత్వాన్ని బాపుతావని
నిన్ను బయటకు తెచ్చాము
మళ్లీ బానిసత్వంలోకి
వెళ్లేంతవరకు నిన్ను
బాధ పెడుతూనే ఉంటాము.

- ఆదిత్య కైరం కొండ
8790771348
8790593638

# విభిన్న భావాలతో ఉత్కర్ష కవిత్వం...

## -ప్రముఖ కవి విమర్శకులు దాస్యం సేనాధిపతి



"నువ్వు నీలిమేఘం...నేను నెమలి పింఛం" కవితా సంపుటిని ఆవిష్కరించిన దాస్యం సేనాధిపతి. వేదికపై అతిథులు

విభిన్న భావాలతో ఉత్కర్ష కవిత్వం రూపు దిద్దుకుందని ప్రముఖ కవి విమర్శకులు దాస్యం సేనాధిపతి అన్నారు. ఆగస్టు 31వ తేదీన హన్మకొండ ఖాజీ పేట లోని వైష్ణవి గ్రాండ్ హోటల్ లో కవయిత్రి ఉత్కర్ష భర్త రావుల సామ్రాట్ అశోక్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని సేనాధిపతి ఉత్కర్ష రచించిన "నువ్వు నీలిమేఘం...నేను నెమలి పింఛం" కవితా సంపుటిని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సేనాధిపతి మాట్లాడుతూ కవయిత్రి ఉత్కర్ష కవిత్వం ద్వారా తమ భర్త పై ఉన్న ప్రేమాభిమానాలను చాటే ప్రయత్నం చేయడం ప్రశంసనీయమని అన్నారు. తమ అన్యోన్య దాంపత్యంలోని మధురిమలను చక్కగా ఆవిష్కరించారని కొనియాడారు. జీవన యానంలో ఎదురయ్యే సమస్యలను సమయానంతో, స్వాభిమానంతో ఎదుర్కోవాలని కవయిత్రి పేర్కొనడం సంతోషదాయకమని వివరించారు. ఉత్కర్ష భర్త సామ్రాట్ అశోక్ కు శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా సత్కరించారు. కవయిత్రి మెరుగు అనురాధ పుస్తకాన్ని సమీక్షిస్తూ కవయిత్రి ఉత్కర్ష తమ భర్త పై గల గౌరవాన్ని చాటుతూ రాసిన కవితలు అందరినీ ఆకట్టుకునే విధంగా ఉన్నాయని తెలిపారు.

ప్రముఖ కవి బిల్ల మహేందర్ పుస్తకంలోని కొన్ని కవితలను ప్రస్తావిస్తూ కవయిత్రికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కవయిత్రి మాట్లాడుతూ తమ పుస్తక ఆవిష్కరణ మరియు భర్త పదవీ విరమణ సభకు హాజరైన బంధు మిత్రులకు, కవులు, రచయితలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంకు గట్టు రాధిక, మోహన్,అరుణ, దాస్యం గీతారాణి, కార్తీక్, ముక్కెర సంపత్, ఏడెల్లి గారితో వందలాది మంది బంధు మిత్రులు హాజరై సామ్రాట్ అశోక్ ను సత్కరించారు.



ఈ వారం అంశం: కాళ్ళు
పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా. రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు.
2025 "వారం వారం కవితల వర్క్ షాప్" 31 కు మొత్తం 22మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు.
8 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.

-డా॥రావి రంగారావు
9247581825

## వచన కవితలు

### జీవశక్తి

గమ్యం చూపే జీవ శక్తి,
నవోదయాన్ని చేరే ఆశ దీప్తి,
నెమ్మదిగా మొదలైన నడకలోనే,
విజయాల నినాదాల ప్రతిధ్వని.
చిన్నప్పుడు తల్లిపాలు తాగుతూ,
చదువుకోటానికి బడి దారిలో,
తప్పటడుగులు వేసిన అడుగులు,
ఈ రోజు బలమైన బాటలు...
వర్షంలో తడిసిన మట్టిలో గోతుల్లో,
వెన్నెల రేయిలో కలల చప్పుళ్లలో,
కాళ్లు అడిగిన ప్రశ్న ఒక్కటే ?
"ఏదీ శ్రమ ? ఏది గమ్యము?"
పాదరక్షలు లేక పోయినా పరవాలేదు,
సంకల్పం ఉంటే మార్గమే తలవంచుతుంది.
ఎర్రని నెత్తురు చినుకులు చినిగినా,
కాళ్లు వెనక్కి తిరగవు, తడబడవు.
తండ్రి శ్రమలో ముదిరిన పాదాలు,
తల్లి దేవతగా గడిపిన కాలాలు,
వీధులపై తిరిగిన దినసరి కాళ్ళు,
అన్నీ మన కాళ్ల చరిత్రలో భాగమే.
తీర్థయాత్రల త్రోవలో బాట సజీవం,
కానుకలు మోసిన దేవాలయం గడపలో,
భక్తి కంటతడి తొక్కిన అడుగులో,
దేవుడికి ముందు సాష్టాంగ నమస్కారం.
కాళ్లు ఉంటేనే కదలగలం
కలల వెంట నడవగలం!
బాటలు ఎరగని అడవిలోనూ
బయటపడగలదీ జీవన పయనం!
పరాకాష్టలకు పరుగులు తీసే
పతనాల్లో నిలబడే
ఆ కాళ్ళను చూసుకో హృదయమా!
అవే నీ విజయ గాధలకు
పునాదులు కదా!
నీ కాళ్ళు, నీ ప్రయాణాన్ని,
నీ కష్టాలను గుర్తుపెట్టు ?
వాటి వెంటే ఉన్నది నీ స్ఫూర్తి,
నీ స్వరం, నీ కథ!

-రాజ్య లక్ష్మీ శశిధర్

### 'మూలాలు'

వర్తమానపు వెలుగులో
సాధించిన విజయాలతో
భవిష్యత్తుపై ఆశలతో
రంగుల కలలు కంటున్న ఓ మనిషీ!
లక్షల సంవత్సరాల వెనక్కి చూడు
ఈ నవనాగరికతకు
మూలాలను దర్శిస్తావు
అడ్డంగా పెరిగిన వెన్నెముక
పరిణామక్రమంలో..
నిటారుగా నిలిచి
నడక నేర్పిన రెండు 'కాళ్ళు'! ...
తొలి సాహసులు...
ప్రకృతి విలయాలకు భీతిల్లి...
తలదాచుకోవడానికి పరుగులు తీసి...
ఆహారపు వేటలో అలసిన 'కాళ్ళు'!...
తొలి శ్రామికులు...
ఆహారాన్ని గుర్తించే క్రమంలో
ప్రాణాలను పణంగా పెట్టిన
ఆదిమ 'అమ్మ'లు...
త్యాగమూర్తులు...
'నిప్పు'ను కనిపెట్టి
'వ్యవసాయం'తో బువ్వ పెట్టి
'పశుపోషణ'తో సంపద పెంచి
కుమ్మరి 'చక్రం'తో
చరిత్ర గతిని మార్చిన 'కాళ్ళు'!...
ఆర్థిక జ్ఞానులు...
అనాగరిక దశను దాటి
నాగరికత నేర్పి
ఆధునికుడిగా అవతరించి...
ఆటలాడి నాట్యమాడి
సముద్రాలు దాటి చంద్రుడిపైకి చేరి
అంతరిక్షానికి ఎగిరిన 'కాళ్లు'!...
అద్భుతాలకు సంకేతాలు...
దేశ రక్షణకు
కదం తొక్కుతున్న 'కాళ్లు'!...
ప్రాణదాతలు గిట్టుబాటు' లేక
ఉరితాళ్లకు వేలాడిన 'కాళ్లు'!...
అన్నదాతలు.
కన్నబిడ్డల స్వార్థానికి బలై
పరాయిపంచలకో,
వృద్ధాశ్రమాలకో చేరిన 'కాళ్లు'!..
గుండె కోతలకు నిదర్శనాలు!
కన్నవాళ్లు..
వైద్యులే హంతక ముఠాలైన వేళ
భ్రూణహత్యకు గురైన
శాపగ్రస్తమైన 'కాళ్లు'!.. '
ఆడ' శిశువులు!
'కరోనా' మహమ్మారికి భయపడి
స్వగ్రామాలకు
రోజులు తరబడి నడిచిన 'కాళ్లు'!...
అర్థాంతర మృతులు...
అంతులేని అడుగుల ప్రయాణంలో
నిర్విరామంగా నడిచే కాళ్ల'ను
కనిపెట్టుకుందాం...
కళ్లకు అద్దుకుందాం

- పుట్టంరాజు నరసింహమూర్తి

నా జీవితంలోకి రావడానికి పారాణి రాసుకున్న కాళ్ళు
నా చిటికెన వేలు పట్టుకుని ఏడడుగులు వేసిన కాళ్ళు
ఆ ఏడడుగులతో నా హృదయ సామ్రాజ్ఞి
అందలం ఎక్కిన కాళ్ళు
కొత్తగా మొదలెట్టే జీవితంలో నా పక్కన నిలబడ్డ కాళ్ళు
నా కోసం ఉదయాన్నే వంటింట్లో పరిగెత్తిన కాళ్ళు
ఎదురుచూపులతో పచార్లు కొట్టిన కాళ్ళు
నన్నే ఆలంబనగా చేసి నడిచిన కాళ్ళు
గమ్యం ఎంత దూరమైనా సిద్ధమైన కాళ్ళు.
పట్టీలతో పలకరించగా మురిసిన కాళ్ళు
వాటిని అలంకరించగా మెరిసిన కాళ్ళు
సిరిమువ్వల సవ్వడితో నా మనసు దోచుకున్న కాళ్ళు
గోరింటాకు పెట్టుకొని హ్వాయలు పోతున్న కాళ్ళు.
ఇప్పటికీ ఎప్పటికీ నా రాణిగా
బతుకంతా తోడుగా
ఉండటానికి నాతో నడుస్తున్న కాళ్ళు.

-వాసు రాచకొండ

### నాకెందుకు కాళ్ళిచ్చావు?

బతుకు ప్రయాణపు ఆనవాళ్లు..
కాళ్ళు.
ఎంత అద్భుతం
కాళ్ళు పోయి.. కుమిలి కుమిలి
కృంగిపోయి కర్మ భూమిని
ముద్దాడుతున్న నిస్సహాయులున్న
ఈ లోకంలో
కాళ్ళు పోయినా
కలలే కాళ్ళై ఎవరెస్టు శిఖరాన్ని
అధిరోహించి.. ఉన్నత శిఖరాన చేరిన
అరుణిమా సిన్హా ఎంత అద్భుతం...
శరీరం మనసు
ఏక కాలంలో లగ్నం చేసి
భక్తి శ్రద్ధలతో తన్మయత్వంలో చేసే
నాట్యం.. ఎంత అద్భుతం
నాట్యానికి ఆధారమైన కాళ్లే
లేకపోయినా
నర్తించే నటరాజులను చూస్తుంటే
ఇంకెంత అద్భుతం.
కాళ్ళు లేకపోయినా
జీవితపు కదన రంగాన
ఆత్మ స్థైర్యం తో కదం తొక్కుతున్న
పోరాట యోధుల్ని చూస్తుంటే
నాకెందుకు ఈ కాళ్ళు అన్న
ప్రశ్న నన్ను వేధిస్తుంది!.
హే భగవాన్
నాకెందుకు కాళ్ళిచ్చి కక్ష గట్టావు
కాళ్ళున్నా కళ్ళు మూసుకుపోయేలా
చేశావు,
కాళ్ళు లేని వాళ్ళు
నిజమైన వైకల్యం ఉన్న వాళ్ళు
కాదు...
అన్నీ ఉన్నా... ఆశ లేని వాళ్ళు
ఆశయం లేని వాళ్ళు
బద్ధకం ఆవహించి బతుకుని
ఆస్వాదించని నా లాంటి వాళ్ళు
నిజమైన వైకల్యులు

-రాజ్ తొర్లపాటి...

### 'కాళ్ళే'కదా అని చులకనగా చూడకు

'కాళ్ళే' కదా అని
'చులకన'గా చూడకు.
ఆ 'కాళ్ళే' సుమా
బ్రతికున్నన్నాళ్ళూ నీ 'బరువు'ను మోస్తూ
భూమ్మీద నిన్ను 'మనిషి'గా నిలబెట్టేది!.
'కాళ్ళే' కదా మరి
'బ్రతుకు' ప్రస్థానంలో అడుగేయిస్తూ
అభివృద్ధి పథంలో
నిన్ను ముందుకు' నడిపించేది,
అవును ఆ 'కాళ్ళే.
నిత్యం నిన్ను కదలించీ
ఉరుకులు పరుగులు పెట్టించేది!
నీ 'జీవన' గమనాన్ని 'రక్తి' కట్టించేది.!!
'కాళ్ళే' కదా అని హీనంగా చూడకు
మరి...
కాళ్ళు' లేని మానవ 'శరీరం'...
చక్రాల 'కుర్చీ'కే అంకితం...!.
'అమ్మ' కడుపులో ఆకారం దాల్చిన
రక్తమాంసాల 'ముద్ద'...
'బిడ్డ'గా 'ఊపిరి' పోసుకునీ...
తల్లికి తన తొలి 'స్పర్శ' అందించేది...
కడుపున 'కాళ్ళ'తో తంతూనే కదా...!.
బుడి బుడి నడకల
తడబడు 'పసి' ప్రాయాన
'తండ్రి' చేయందుకుని
అడుగులేసే 'బుడత'డు
బ్రతుకున 'నడక' నేర్చేది...
ముద్దొచ్చే తన 'పాదా'లతోనే కదా!.
'ఓనమాలు' దిద్దించే 'గురుబ్రహ్మ'కు
'భక్తి'తో శిష్యుడు సమర్పించే
'గురుదక్షిణ'
'కాళ్ళ'కు చేసే ప్రణామమే కదా!.
కోటి 'కోర్కె'ల్ని పిడికిలి మించని
తన 'గుండె'లో దాచుకుని
కోవెల్లో అడుగు పెట్టిన పరమ 'భక్తుడు'
'భక్తి'తో మొక్కేది
ఆ దేవుడి 'కాళ్ళ'కే మరి!.
పరుగుల 'రాణి' పి.టి. ఉష...
ప్రపంచ ప్రఖ్యాతినొందినది...
తన 'కాళ్ళ' వల్లనే కదా...!
ఎవరికీ అందని
'ఎవరెస్ట్' శిఖరాన్ని అధిరోహించిన
ధీర వనిత 'బచేంద్రిపాల్'కు
'ఘనత'ను సాధించిపెట్టినవి
ఆ 'కాళ్ళే' మరి!,
'ఆదర్శ' పురుషుడు...
ఆ శ్రీరాముని పావన
'పాద' స్పర్శతోనే కదా
'రాతిబొమ్మ'
రమణి 'అహల్య'గా మారి
'జీవం' పోసుకున్నది...!!
'పురాణ' గాథల్లోనే
అంతటి వినుతికెక్కిన 'కాళ్ళ'ను
కలియుగాన 'చిన్నచూపు' చూడొద్దు,
అంతెందుకు!
'ఊపిరి' ఆగిన పిదప
మానవ శరీరమనే 'కట్టె'ను
కడకు 'కాటి'కి మోసుకు పోయేది..
ఆ నలుగురి 'కాళ్ళే'నని మరువకు!

-రాయపురెడ్డి సత్యనారాయణ

## మినీ కవితలు

### తండ్రి కొడుకు

ఎత్తుకు
చేర్చిన కాళ్లు
విశ్రాంతి తీసుకుంటున్నాయి
కళ్ళకు
ప్రపంచాన్ని చూపిస్తూ!

### శవయాత్ర

ఆ దారికి
ఆ కాళ్ళు పరిచయమే.
నిన్నటి వరకూ
నడచి నడచి,
అలసిన కాళ్ళకు,
పుష్పాభిషేకం
చేస్తుంది దారి.

### మేఘం

ఒళ్లంతా
కాళ్లు చేసుకుని,
పరిగెడుతుంది.
రైతన్నను
అభిషేకించాలని...

### ఆదర్శ దాంపత్యం

ముందున్నానని
ఒక కాలికి
గర్వం లేదు.
వెనుక పడ్డానని
ఇంకో కాలికి
బాధా లేదు.
కడదాకా....
కలిసి ప్రయాణమే...!!!

### గడియారం

కాళ్లు
లేకపోయినా,
ఆ ముగ్గురు
నడుస్తూనే ఉన్నారు.
ముళ్ళ దారిలో
ప్రాణం పోయేవరకు..,
కాలం విలువ చెప్తూ....

### చేతి కర్ర

గుక్కెడు నీళ్లు
పోసినందుకే
కృతజ్ఞత చూపెడుతుంది.
ఆ చెట్టు...
అలసిన కాళ్లకు
తోడై,....

### సమాది నిద్ర

ప్రశాంతంగా
పడుకున్నాడు అతను.
అలసిన కాళ్లను
తల్లి నొక్కుతుందిగా!
భూమాతను చూస్తూ
శ్మశానంలో చెట్టు
కవిత్వం చెప్తుంది....

-వై శివకుమార్

# లోకం

కథ



-లక్ష్మణరావు పతంగే
సెల్:92900 79047

**మాపట్యాల నాకో కలొచ్చింది. ఒక పెద్ద ఆకారం లెక్క కన్పిచ్చిందిగాని దాని ముక్కు మొకం సరిగ్గ కన్పియ్యలె. గాని ఎవల్లో దేవత మొగులు మీదికెల్లి దిగొచ్చి నట్లగుపిచ్చింది. భూతం లెక్క నాకాడ్కి మెల్లగ నడిసొస్తొంటె నాకొన్కుబుట్ట సాగింది. అంతట ఎల్గు ఎలిగిపోతున్నది. గారోష్ నీల నాకండ్లు మూత బడ్డయి. బయానికి నాపెయ్యి బరఫ్ లెక్క సల్లబడ్డది. సల్లచెమ్టలుబట్టినై. గా ఆకారం నా పక్కల్నె కూసున్నది.**

మెల్లగా నా యాపుమీద సెయ్యేసి నిమురసాగింది. నాపెయ్యి కట్టె

> “అరే నువ్వేంది జెప్పేది, నేన్జెప్తా యిను. ఇగో నాకు ఈ దునియాతోని యాష్టకొచ్చింది. నా కొడ్కులు పెద్దగయిౖను. ఇంటి పన్లన్ని గాళ్ళె సూస్కుంటుౖను. దేవుని దయతోని నా చేనేత సంగానికి ఆరు లక్షల అప్పు దొర్కింది. ఇంకో సంగం వొరంగల్లుల మొన్ననే తెర్సిన. సికిందరాబాదుల బంగ్లా కట్టిన. హైదరాబాద్‌ల ఊరిబైట ఐదెకరాల భూమిగొన్న. సిన్న కొడ్కు సద్వనీకె అమ్రీకా బొయ్యిండు. గండ్కె నేనిప్పుడు బేఫికర్. నాకేం రంది లేదు. రోజూ గీయాల్లకు గీడ్కొచ్చి కూసుంట”

లెక్కయింది. గారూపం “నాయనా! శాన గొప్పోడివిరా! గీ దునియాల నీ అసోంటోళ్ళ అవసరం గిప్పుడు శానున్నది. లే బిడ్డా! లే! ఈ లోకాన్ని ఉద్ధరించురా! లోకం కోసం నువ్వు చెయ్యాల్సింది శాననే ఉన్నది. ఇంటి గడపదాటు లోకంలోకి పో. గీప్రపంచం వాకిట్ల అడుగుబెట్టు. నీ అసుంటోళ్ళను ఐదు మందిని తయారు సెయ్యి. వాళ్ళకు గ్యానబోదసెయ్యి. ఎంట బెట్కోని తిర్గు. గీ దునియాని మార్చెయ్యి నాయనా! నా ఆశీర్వాదం ఎప్పుడు నీకుంటది పో” అన్కుంట మాయమయ్యింది.

నా కండ్లు వాటంతటవ్వే తెర్సుకున్నయి. అటూ యిటూ సూసిన. ఎవల్లు లేరు. దీగుట్లె గుడ్డి దీపం ఎల్గుతనే ఉన్నది. ఒక మూలకు అమ్మ ఈతసాప మీద పండ్కోనున్నది. గా కల యాదుకొస్తేనే బయమేస్తున్నది. మెల్లంగ మంచం దిగిన. గొంతు ఎండిపొయ్యున్నది. సురాయిల నీళ్ళుంటే గట గట తాగిన. కొంచెం నిమ్మలమైంది. కండ్లల్ల మాత్రం గాఎల్గు రూపం కనిపిస్తనే ఉన్నది. గామాటలు ఇనిపిస్తనే ఉన్నయి. ఏంచెయ్యాల్నో తోస్తలేదు. తెల్లకాయిదం తీస్కోని భక్తుల పేర్లు రాద్దామని కూసున్న. గప్పుడే కోడికూసింది. ఇంకా తెల్లారనీకె గంటున్నరుంది. తెల్లారంగనే బయలెల్లాలె. కాని యాడ్కి పోవాలే. యాడ ఎత్కాలె. గింతపెద్ద పట్నంల ఐదుగురు దొర్కరా! అంతట్లనే తెల్లారింది.

నా బస్తీలనే ఐదుగుర్ని జమ చేయాలె కాని నా మాటెవరింటరు. గాదేవుని మాటను నల్గురికిన్పిస్తే గాళ్ళె ఎంటొస్తరు అనుకున్న గాని జనం నన్ను ఎర్రోడను కుంటరు. గందుకే ఎవ్వల్కి చెప్పకుండ ఉండాలనుకున్న.

తెల్లారింది. మొకం గిట కడ్కోని తానంజేసి, నాష్టజేసిన. బట్టలు తొడ్కోని బైటికి పోతుంటే, అమ్మ, “యాడ్కిరా! తయారయ్యినవ్” అన్నది.

“యాడ్కి లేదే, కొంచెం పనున్నది. ఐదుగురు దేశభక్తుల్ని తయ్యారుచెయ్యి మన్నడు దేవుడు. వాళ్ళ కోసం బోతున్న. నువ్వు తిను. నేను మల్ల పొద్దుమీకే వొస్త”.

“నీ మొకం గీ దునియాను ఎన్కసిరికి మారుద్దువుగాని ముందుగాల బట్టలు మార్చుకో.”

“మార్చుకున్ననే, కన్పిస్తలెవ్వా!”

అమ్మ నా చెయ్యిబట్టి సూసింది. పెయి ఎచ్చగున్నది.

“గిదేందిరా! పెయిల జెరమున్నట్లున్నది”

“కాదే అమ్మ! నా పేయిల గాదేవుని ఎల్గున్నది. గందుకే గరంగున్నది”

“ఓరి ఎర్రోడా! ఎల్గుగిల్గు అన్నవంటె జనం నవ్వుతరు. ఈన్కి దెయ్యం బట్టిందంటరు. పో, పన్కి పో! దేశం నిండ లీడర్లున్నరు. ఆళ్ళకు శాతగాన్ది గీ మొగడు బైలెల్లిండు ఉద్ధార్కానికి” అనుకుంట గదిమింది అమ్మ.

‘‘గాళ్ళేం మారున్తరే అమ్మ. సొసంత్రమొచ్చి ఇరవై ఐదేండ్లయ్యింది. అయినా మనగల్లికి లైటులేదు. నల్లాలేదు. గారాజుగారి జమానాల పెట్టిన నల్లా నీళ్ళే తెచ్చుకోబడ్డిమా, చెప్పు.”

“ఎందుకు సెయ్యర్రా! దేశమంత ఒక్కనాడే సేస్తార్ర. మెల్లమెల్లగ సేస్తరు. మొన్ననే గద ఎం.ఎల్.ఏ. ఎంకటసామి మనబస్తీకి వొచ్చిపొయ్యిండు. ఓట్లు అయిపోంగనే మన గల్లీకి రోడ్డు, నల్లా, లైటు అన్నీ ఏపిస్తనన్నడు.”

“గదేనే అమ్మ, గాలీడర్లు ఎలచ్చన్ల ముంగల మనచుట్టూ తిర్గుతరు. గవి కాంగనే మనం వాళ్ళచుట్టూ తిర్గాలెనాయె.”

“అదేమన్నగాని నువ్వు పనికి నాగబెట్టి లోకాన్ని ఉద్ధరిస్తనంటె బువ్వకు ఎట్లగడుస్తది సెప్పు. పనికి పో బిడ్డా!”

“గీరోజు మాత్రం నన్ను ఆపకే! గాదేవుని మాటను కాదనకు. నన్ను పోనియ్యి” అనుకుంట బైటికొచ్చిన.

దేశభక్తులంత అసెంబ్లీకాడ దొర్కుతరని ఎవల్లో చెప్తే గాడ్కి పొయ్యిన. గేటుకాడ నిలబడ్డ. రఁయ్ రఁయ్ మన్కుంట మోటారుకార్లు లోపల్కి పోతున్నయి. మంత్రులంట ఎమ్మెల్లేలంట, ఇంకా లీడర్లంట, ఒక్కల్లేమ్టి శానమందే లోపల్కి పోబట్టిౖను. సారూ! సారూ! అన్కుంట ఎంత అర్సినా ఒక్కల్లుగూడ నాదిక్కు సూడలేదు. లోపట అందరు జమ అయ్యిౖనంట గాముఖ్యమంత్రితోని, ఏమో చర్చలున్నయంట. మెల్లగ లోపల్కి పోదమంటే పోలీసాయనొచ్చి, “గీడ నిలబడద్దు, పో!” అని లాఠీ తిప్పిండు. ఇగ లాబం లేదని ‘భక్తుల్యాడ దొర్కుతరబ్బా?’ అన్కుంట ఫుట్‌పాట్ మీద్నెల్లి నడ్సుకుంట బోతున్న. యాడ్కి బోతున్ననో నాకే తెల్వదు. కాళ్ళీడ్వబట్టినై. కడుపుల మాడబట్టింది. గట్లనే బోతుంటే దవ్వుల ఒక బోర్డు కన్పిచ్చింది. ‘ఎమ్.ఎల్.ఏ’ క్వార్టర్సు’ అని. గాడికి పొయిన. ఒక కోటర్ అరుగుమీద కూసున్న. గాయింటి తల్పు వోరకేసి ఉన్నది. తల్పు సందులకెల్లి మెల్లగ తొంగి సూసిన. గాడ ఎవల్లుగూడ లేరు. గాని గారూమ్ అంతా షాన్‌దార్‌గ సజావట్ చేసుంది. ఎవల్లో లీడరిల్లయి యుంటదనుకున్న. ‘సూద్దాం లోపల ఎవలున్నరో!’ అన్కుని మెల్లంగ లోపల్కి అడ్గుపెట్టిన. కింద మెత్తగ జంపఖాన పర్సుంది. సోపాలున్నయి. అవిటికి మఖ్‌మల్ బట్ట గలేబులేసున్నయి. ఎవలన్న వొస్తరేమో సూతం అనుకొని మెల్లంగ పొయ్యి ఓ గద్దీమీద కూసున్న. కండ్లు మూస్కోపోబట్టినై. పానం ఆయిమన్నది. అంతట్లకే తలుపు దగ్గర ఇద్దరు మన్సులు ఏవేవో మాట్లాడుకుంటున్నరు. మాటలైపోయినంక ఒకాయన లోపలికొచ్చిండు. మనిషి ఎత్తుగున్నడు. పెయిమీద ఖద్దరు బట్టలున్నయి. నెత్తిమీద తెల్ల టోపి ఉన్నది. రాంగానే కుర్సీల కూసున్నడు. టెలిఫోను ఎత్తి ఎవల్లవో నంబర్లు కల్పిండు. మాటలైపొయ్యినై. ఫోను పెడ్తున్నప్పుడు గాయ్న సూపు నా మీద పడ్డది.

నన్ను సూసి మన్సి హైరానైపొయ్యిండు. కుర్సీలకెల్లి లేసి నాకాడ్కి వొచ్చిండు.

నా కండ్లల్ల సూస్కుంట “ఎవరు నువ్వు” అన్నడు.

నేను లేసి నిలబడి, నేను మీ కోసమే వొచ్చిన సారూ! ఒక ఖబర్ దెచ్చిన అన్న.

“ఎవ్వరిది?” అన్నడు.

“భగవంతునిది” అన్న.

“గాపేరు ఇనంగనే గాయ్న మోకం ట్యూబ్‌లైట్ లెక్క జిగెల్లుమన్నది. కండ్లు మెర్వబట్టినై. మొకంల నవ్వు కన్పిచ్చింది. నాకు ఇజ్జత్ ఇచ్చిండు. కూసోమన్నడు. నా పక్కనే ఉన్న సోపాల కూసున్నడు.

‘‘నువ్వు ఎందుకొచ్చినవ్వో నా కెర్కయింది. భగవాన్ కెమికల్స్ దగ్గరికెల్లి వొచ్చినవు గదా! గాయ్న కోసం నేను మందుల కంపెనీ పెట్టనీకే సిఫారసు చేసుంటి” అన్నడు.

“గదిగాదు సారూ! మీరే మంటాౖనో నాకు సమజయిత లేదు”

“ఏందయ్యో! నువ్వు భగవాన్ కెమికల్స్ వాళ్ళ దగ్గర్నుండి రాలేదా? అయితే ఎవల్ల కాడి నుండి వొచ్చినవో సెప్పు” అన్నడు.

“నేను నిజంగనే దేవుడిచ్చిన కబురు దెచ్చిన. భగవాన్ కెమికల్స్ తాన్కెల్లి రాలేదు సారూ” అన్న.

నా మాటలు గాయ్న సెవుల్ల ఇంకా బడ్డయ్యే లేదో గాయ్న మోకం మీది నగు మాయమయ్యింది. కండ్లు సింతనిప్పులెక్క ఎర్రగైనయి. మోకం ఆలుగడ్డ లెక్కయింది. ఎంబడే టేబుల్‌మీదున్న గంట కొట్టిండు. లోపలున్న నౌకర్లు ఉర్కొచ్చిౖను.

“అరె వారీ! గీభక్తుణ్ణి మర్యాదగ మెడల సెయ్యేసి బైటికి నూకుండ్రి!” అన్నడు.

గాళ్ళిద్దరు మిలిటరీ జవాన్ల లెక్కున్నరు. నా రెండు సంకల్ల చెరో సెయ్యేసి తలుపు తీసి సడక్ మీదికి ఇసిరేసిౖను. నా బట్టలన్ని దుమ్ము దుమ్ము అయ్యినై. “గీ లీడరోన్కి దేవుడంటే గింత కోపమెందుకో” అన్కున్న. ఈళ్ళే ఊళ్ళకొచ్చి, సడక్ లేస్తం, గుళ్ళు కట్టిస్తం అని గప్పాలు కొడ్తరు. గాని ఒక్క పన్జెయ్యరు. లాబం లేదని బట్టలు దుల్పుకోని నడ్సుకుంట సుల్తాన్ బజార్కు వొచ్చిన. హైదరాబాదల బజారంటే సుల్తాన్‌బజారే నాయె. నూర్లకొద్ది దుక్నాలు. ఏలకొద్ది మన్సులు, లచ్చల బ్యారం నడుస్తది గాడ.

ఒక్కతాన కూసోని ఒక్కొక్కణ్ణి అజమాయిస్తున్న. కాని ఎవ్వని మొకంల గూడ గాజ్యోతి కన్పిస్తలేదు. అందరు ఎవ్వరి పని వాడే సూస్కుంటున్నట్లు కన్పిచ్చింది. ఒకల్ల గురించి మరొకల్లు పట్టిచ్చుకునేటట్లు లేదు. అందరు మస్రూఫ్ ఉన్నరు.

సర్కారినల్ల కాడ కూసోని సద్దిమూట యిప్పి తిన్న, నీళ్ళు తాగిన. పానానికి కుద్యారమైంది. గట్లనే కూసోని సూడబట్టిన. పొద్దుపోబట్టింది. ఎదురుంగ ఒక బట్టల దుక్నపోని మీద నా కన్ను పడ్డది. గాయ్న సీరలు అమ్ముతుండు. గాయన్న ముందల ఒకాడామె నిలబడున్నది. గామెతోని ముచ్చట్లు బెట్టుకుంట ఏమో అంటున్నడు. నేను మెల్లగ గాడ్కి బోయిన. “నమ్మకం లేకుంటె ఇంకో దుక్నంలకు పొయ్యి అడ్గుండి. గిది కాశ్మీరు ప్రింటు సీరె. గీ మాలు మాతానె తప్ప మర్యాదా దొర్కదు. దొర్కినా ఐదునూర్ల కంటె తక్కువుండదు. దీన్ని నేను నీకు మున్నూట యాభైకే యిస్తున్న. నేను బ్యారం పోకూడదనే తక్కువకు ఇస్తున్న. మల్ల నువ్వు వొస్తవని నాకు సంపాదించాలని లేదమ్మా. ఏదో మీఅసోంటోళ్ళకు సేవ చేయాలనే గీదుక్నం బెట్టుకున్న” అన్నడు. గామె మస్తు ఖుషి అయ్యింది. ఎంటనే సంచిలకెల్లి పైసలీడ్సిచ్చింది. చీర దీస్కోని మురుసుకుంట పొయ్యింది. గంతల్నే ఇంకిద్దరొచ్చిౖను. గాళ్ళకు కూడ గవే మాటలు చెప్పి ఇచ్చి పంపించిండు. నాకనిపిచ్చింది ఎంత దర్మాత్ముడు? లాబం లేకుంట బ్యారం చేస్తున్నడు అని.

గాచీరలమ్మే సేటు వైసోడేంగాదు. నడివయసోడు. మన్సి మొకంమీద సంతోషం కన్పిస్తున్నది. చేతికి ఉంగరాలున్నయి. గాయ్న తీరు జూస్తే గీన గొప్ప బక్తుడు లెక్కున్నడనిపిచ్చింది. “ప్రజాసేవయే మా కర్తవ్యం” అని ఆర్.టీ.సి వాళ్ళు బస్సుల మీద రాస్కున్నట్లు గీన లాబాపేక్ష లేకుండ బ్యారం చేసత్తాండు. ఎంత పుణ్యాత్ముడనుకున్న. గరీబోళ్ళకు ఎంత సాయం చేస్తుండు. గీ పెద్ద మన్సితానికి పోయి నా ముచ్చట చెప్తె జర సాయం జేస్తడనుకొని దుక్నంలకు పోయిన. గా సేటు నగుకుంట నాతాన్కి వొచ్చి కిందమీద జూసిండు.

‘పైంటు బట్టనా?’

‘కాదు’

‘అంగిబట్టనా’

‘కాదు’

‘పంచెనా’

కాదు అన్న.

‘మల్ల నీకేం కావాల్నొ సెప్పు’ అన్నడు.

‘నేను మీ కోసం ఒక మంచి ఖబర్ తెచ్చిన సేటూ’ అన్న.

‘అచ్చాచ్చా! ఈరభద్రయ్యె దెగ్గిర్నుంచి పెండ్లి సంబంధం తెచ్చినవా?’ అన్నడు.

‘కాదు, దేవుని మాటను మోస్కొచ్చిన. నాకు దేవుడు కలల కన్పిచ్చిండు. మీ అసుంటి దర్మాత్ముల తాన్కి పొమ్మన్నడు’ అన్న.

‘అయితే నా బిడ్డెకు రిష్తా తేలేదన్నమాట, బట్టలు కొనడాన్కి రాలేదు. మల్ల ఎందుకొచ్చినవ్’ అన్నడు.

‘గదేంది సేటు తిట్టకు. దేవుడు పంపితేనె వొచ్చిన’ అన్న.

‘వారీ! అంబయ్య గీగొప్పోనికి మర్యాద సెయ్యిరా’ అన్నడు.

అనంగనే నౌకరోడొచ్చి నా రెట్టబట్కోని దుక్నం బయటికి నడిపిచ్చుకుంట ‘గిసువంటి పిచ్చి శాతలు చెయ్యకు తమ్మీ. మాసేటు మెడబట్టి నూకుమన్నడుగాని నేనే నీకు మర్యాదగ బైటికి పంపుతున్న’ అన్నడు.

ఏంద్రగిది మర్యాదసెయ్‌మంటే గిదేనా అన్కున్న. మర్యాద అంటె మెడబట్టి బైటికి నూకుడన్నమాట.

గాడ్కెల్లి మెల్లగ బైలెల్లిన. నయాపుల్, చార్‌మినార్‌లు దాకా పోయిన. యాడ యే బక్తుడు కనబల్లే. కాళ్ళీడ్సుకుంట ఇంటి మొగం బట్టిన. ఇంటికొచ్చి మంచంల కూలబడ్డ.

నా హాలతు జూసిన అమ్మ నాలుగు తిట్లు తిట్టింది. మళ్ళ ఏం తిన్నడో ఏమో అన్కోని కంచంల అన్నం రొట్టె పెట్టి తెచ్చి ‘తిను బిడ్డా’ అన్నది. తిని పండుకున్న.

యాణ్ణో దూరంల కోడి కూసింది. మేల్కయింది. తెల్లారుజ్హాము అది. కొంచెం సేపు కునుకు తీసిన. గింతల్నే మసీదులకెల్లి అజాన్ ఇన్పిచ్చింది. లేసి చెంబట్క పొయ్యొచ్చి మొకం కడ్కొని తానం జేసిన. దేవుని అర్రలకు పోయి దీపం బెట్టి దేవున్కి దండం బెట్టిన. ఈ రోజన్న బక్తులు దొర్కెటట్లు చెయ్యి! అని మొక్కుకున్న.

అమ్మ అన్నమొండింది. గింత తిని ఇంకొంచెం సద్ది కట్కున్న. మల్ల అమ్మకు జెప్పి బైలెల్లిన.

తోవల ఒక చెమన్ కన్పిచ్చింది. గండ్లకు పొయ్యిన. ఒక మార్వాడి సేటు నెత్తిమీద టోపి ఉన్నది. చేత్ల బట్ట సంచి ఉన్నది. దాంట్ల శెక్కరి ఉన్నది. గాశెక్కరిని గాచెమన్‌ల యాడ యాడ నల్లసీమలున్నయో సూసి సల్లుతున్నడు. గాయన్ని సూడంగనే ఎంత దర్మాత్ముడు! సీమలకు శెక్కరేసి పున్నెం గట్కోంటాండు. గీజమాన్ల పక్కోడు ఉపాసముంటే కూడ బుక్కెడు బువ్వ బెట్టరు. గానీ గీసేటు ఎంత దయగల్లోడు. సీమలకు కూడ అన్నం బెద్తుండు అన్కోని గాయ్న ఉన్న కాడ్కి పోయి పక్కన నిలబడ్డ.

“క్యా హయ్” అన్నడు.

“సేటూ దేవుణ్ణి సూస్తవా?” అన్న.

గాయన్న నవ్వుకుంట ‘అరే భాయి దేవుడు కన్పిస్తె సూడనోడు ఎవ్వరుంటరు సెప్పు’ అన్నడు.

‘అయితే నువ్వు సక్కంగ నా యెంట రా. సూపిస్త’ అన్న.

‘యాడ్కి’ అన్నడు.

‘గాసెట్టు కాడ్కి రా!’ అన్న.

‘ఆగు! గింత శెక్కరి సీమలకు ఏసి వొస్త’ అన్నడు.

‘నాకు శాన ఖుషీ అయ్యింది. ఒక్క బక్తుడు దొర్కిండు’ అనుకున్న. గప్పుడే గాణ్ణె ఇంకొక్కడు ఎదురైండు. గాయ్న నడివైసోడు. తలకాయ కింద కాళ్ళు మీద సేసి శీర్షాసనం ఏసి వున్నడు. మెల్లగ గాయ్న తాన్కి పోయిన.

‘ఏం జేస్తున్నవు’

‘ఆసనం. పెయికి మంచిది’ అన్నడు.

‘అయితే నీకు దేవుని మీద నమ్మకమున్నదా?’ అని అడ్గిన.

‘ఎందుకు లేదు? గాయ్నతోనే కదా దునియా నడుస్తున్నది’ అన్నడు.

‘అయితే నా ఎంటొస్తె నీకు దేవుణ్ణి సూపిస్త’ అన్న.

‘యాడున్నడు?’

‘ఈణ్ణే ఉన్నడు’

అయితే నడు వొస్తున్న అనుకుంట కాళ్ళు భూమికానిస్తూ లేచి నిలబడ్డడు. గదే చమన్‌ల ఒక చెట్టుకాడ ఒక వైసు పోరగాడు కన్పిచ్చిండు. వాని చేత్ల కత్తి ఉన్నది. చెట్టు మొద్దులమీద ఏమో చెక్కుతున్నడు. దగ్గరికి పోయి చూసిన గాచెట్టు మీద అంతకు ముందే రాసున్న పేర్లను తీసేస్తున్నడు. వాణ్ణి సూస్తే ఎర్రోనిలెక్కున్నడు. కొంచెం సేపు నిలబడి సూసిన, వాడు చెట్టుమీదున్న పేర్లకెల్లి కొందరి పేర్లే తీసేస్తున్నడు.

‘ఏంరా సాలే! నువ్వు గీడున్నవురా? నిన్ను సంపుత కొడ్కా’ అని ఆ పేరుమీద కత్తితోని పొడ్సిండు.

వాని తీరు సూస్తే నాకు గమ్మత్తనిపించింది. గట్ల చెక్కుతనే ఉన్నడు. వాన్కి యాస్తవొస్తలేదు.

‘ఏంతమ్మీ, ఏం జేస్తున్నవు’ అన్న.

‘గీ సాలెగాండ్లంతా గద్దార్‌గాండ్లన్న. మన సొసైటినీ తినేస్తుౖను. లంగలు, లుచ్ఛలు, బద్మాష్‌గాండ్లు. వీండ్ల నుంచకూడదు’ అన్నడు.

‘ఎందుకు?’

‘నేను ఒట్టుపెట్టుకున్న. గీగద్దార్‌గాండ్లను కతం చేస్త’

‘పగోన్ని పొడ్సి సంపుతరుగాని గిట్ల సెట్టుమీది పేర్లను చెక్కేస్తున్నవు తమ్మీ మంచిదేనా?’

‘గీ బద్మాష్‌గాళ్ళు ఈ గడ్డమీద బుట్టి ఏరే దేశాల పాట పడ్తున్నరన్నా’ ఈళుంటే దేశం ఎట్ల బాగైతదే’ అన్నడు.

‘గీడనే కాదు తమ్మీ దేశమంతటా ఉన్నరు. అందర్ని సంపుతవా?’

‘ఎందోనే మన దేశం హాలతు మంచిగ లేదు. గీకొడుకులు తినమర్గిౖను. గీ బేయిమాన్‌గాండ్లు లీడర్లయి ఏం ఎలగబెడ్తరు చెప్పు’.

‘గా పని మనది కాదు తమ్మీ! అదంతా గవర్నమెంటోళ్ళు సూస్కుంటరు. నా ఎంటొస్తవా నీకు దేవున్ని సూపిస్త’ అన్న.

బెత్తరోన్లెక్క బిత్తర సూపులు సూసిండు. మల్ల ఎందో ఆలోచన సేసిండు. తలకాయ ఊపుకుంట.

‘నేనొస్త నద్వే! యాడ్కి, గాచెట్టు కాడ్కేనా’ అన్నడు.

“అవ్వ! జరబిరాన రా మల్ల” అన్జెప్పి ముందుకు పొయ్యిన.

హైదరాబాద్‌కు అందాన్ని తెచ్చింది బాగె ఆమ్ (పబ్లిక్ గార్డెన్)గా బాగ్యామ్ సూణ్ణీకే యాడ్కెల్లె యాడ్కెల్లో జనం వొస్తరు. లోపల అంత కుంటలున్నయి. తోటలున్నయి. తీరొక్క జీవాలున్నయి, పిట్టెలు, సిల్కులు, ఏన్గులున్నయి. జనం కుసున్నీకె చెట్ల కింద సిమ్టి బెంచీలున్నయి. జనం సెట్ల కింద కూసోని సద్దులు తింటుౖను. ఇప్పటికైతె ముగ్గురు బక్తులు దొరికిౖను. ఇంకిద్దర్ని పట్టుకోవాలి అనుకున్న. గా ముగ్గుర్ని ఒక చెట్టు సూపిచ్చి గాడ కూసోండ్రి అన్న. పక్కల్నె సెర్వ్వున్నది. గాడ్కి పొయ్యిన. శానమంది ఆడోళ్ళు మొగోళ్ళు తానాలు సేస్తుౖను. ఒక మూలకు ఒక ఎత్తు రాయి మీద ఒకాయన కూసోని జపం జేస్తుండు. పెద్ద బొట్టు పెట్టుకున్నడు. కాశాయం పంచె గట్టిండు. మెడల తులసి మాలేస్కున్నడు. జందెం పోగులున్నయి. తానమాడి వొస్తున్నోళ్ళ దిక్కు మొకం బెట్టి జపం జేస్తాండు. ఎవల్లో మానుబావుడనుకున్న. ఎన్కంగబొయ్యి నిలబడ్డ. ఎంతసేపట్కీ నా దిక్కు సూడనేలే. నేనే దెగ్గిర్కిబొయ్యి గాయ్న సెవుల “సామీ! దేవుణ్ణి సూస్తవా?” అన్న. ఎంటనే కండ్లు తెర్సిందు నా దిక్కు సూసిందు.

> “దేశభక్తులంత అసెంబ్లీకాడ దొర్కుతరని ఎవల్లో చెప్తే గాడ్కి పొయ్యిన. గేటుకాడ నిలబడ్డ. రఁయ్ రఁయ్ మన్కుంట మోటారుకార్లు లోపల్కి పోతున్నయి. మంత్రులంట ఎమ్మెల్లేలంట, ఇంకా లీడర్లంట, ఒక్కల్లేమ్టి శానమందే లోపల్కి పోబట్టిౖను. సారూ! సారూ! అన్కుంట ఎంత అర్సినా ఒక్కల్లుగూడ నాదిక్కు సూడలేదు”

“బిడ్డా! నేను సన్నాసిని. సొసంత్రంగ బత్కుతున్న. తపస్సు చేస్కుంటున్న. కన్పిచ్చేటోడు తానే దిగొస్తడు నాయ్నా” అని మళ్ళ కండ్లు మూసుకున్నడు. ఈడొక సన్నాసి! ఈన్కి నా మాట నెత్తికెక్కదు అన్కొని ముందుకు సాగిన. పోత పోత వాన్దిక్కు సూసిన. కొంతమంది ఆడోళ్ళు తానమాడి తడిబట్టల్తోని మీదికొస్తుంటే ఓరగంట సూస్తున్నడు దొంగ సన్నాసి.

“గాన్కి ఇంక సంసారం మీద ఆస బోనట్లున్నది” అన్కున్న.

గట్లనే కొంచెం ముందుక్కు పోంగానే ఒక బెంచి మీద ఇద్దరు ముసలోళ్ళు కూసోని ముచ్చట్లాడుతుౖను.

వాళ్ళ మాట లినిపిస్తున్నయి. ఒకడంటడు,

“అరే నువ్వేంది జెప్పేది, నేన్జెప్తా యిను. ఇగో నాకు ఈ దునియాతోని యాష్టకొచ్చింది. నా కొడ్కులు పెద్దగయిౖను. ఇంటి పన్లన్ని గాళ్ళె సూస్కుంటుౖను. దేవుని దయతోని నా చేనేత సంగానికి ఆరు లక్షల అప్పు దొర్కింది. ఇంకో సంగం వొరంగల్లుల మొన్ననే తెర్సిన. సికిందరాబాదుల బంగ్లా కట్టిన. హైదరాబాద్‌ల ఊరిబైట ఐదెకరాల భూమిగొన్న. సిన్న కొడ్కు సద్వనీకె అమ్రీకా బొయ్యిండు. గండ్కె నేనిప్పుడు బేఫికర్. నాకేం రంది లేదు. రోజూ గీయాల్లకు గీడ్కొచ్చి కూసుంట.”

‘‘నేనేమన్న నీకన్న తక్వుతిన్నా ననుకున్నవ్వా? రైల్వేల టేషన్ మాస్టరుంటి. గాని ఎవల్ల తానగూడ అన్యాలంగ ఒక్క పైసా తీస్కోలేదు. తీస్కున్నా, సేవ జేసే తీస్కున్నగాని పున్యానికి తీస్కోలేదు. మా టేషన్లున్న టీ.టి. శాన మంచోడు. టికెట్టు లేనోళ్ళ తాన పైసలీడ్స్కోనేటోడు. గందులకెల్లి సగం నాకిచ్చేటోడు. రోజువారి కర్సుకు సరిపొయ్యేటివి. జీతం మిగిలేది. అన్ని బెంకుల జమైనయి. సర్కారు కూడ నా పన్తనానికి మెచ్చుకున్నది. ‘బెస్ట్ స్టేషన్ మాష్టరు’ అవార్డిచ్చింది. నా పెండ్లం దప్ప ఇంకొకతె దిక్కు కన్నెత్తి సూడలేదు. మొదటామె సస్తె రెండో ఆమెను పెండ్లి సేస్కున్న. గామె సరిగ్గ సూస్తలేదని మా ఆపీసుల్నె ఓ అటెండరుదాన్ని ఉంచుకున్న. అయినా గీ ఆడోళ్ళతోని అంత ఖుషీ మాత్రం దొర్కలేదు. గందుకే రోజూ గీడ్కి వొచ్చి కూసుంట. గాళ్ళ మాట లిన్నంక ఈ యాళ ఎంత మంచిరోజో. నిన్నంత పరేశాన్లుంటి. దేవుని మాట ఇన్నీకే ఐదుగురు దొర్కినట్లే అనుకున్న. గాయిద్దరి తాన్కి పొయ్యి సుద్ది చెప్పి ‘గాచెట్టు కాడ్కి రాండ్రి’ అన్న. వాళు ‘వొస్తున్నం పా’ అన్నరు. అందరు చెట్టు కింద జమఅయిౖను. అందర్ని ‘కూసోండ్రి’ అని చెప్పి నిలబడ్డ.

నేను ఏం లెక్చరిస్తానా? అని అందరు ఎదురు సూడబట్టిౖను.

ఏం చెప్పాలప్పా! అనుకుంట నిలబడ్డ. నేనెప్పుడు పీచు ఇయ్యలె. నా చేత్లున్న కట్టెకు కట్టిన సద్ది యాదికొచ్చి అది యిప్పి గండ్లకెల్లి ఓ జొన్న రొట్టె తీసి సేత్ల పట్కున్న. దీనిమీదనే మాట్లాతా అని అన్కున్న.

“బక్తులారా! దేవుని మీద నమ్మకంతోని మీరంతా నా మాట మీద భరోసా జేసి వొచ్చినందుకు మీ అందర్కి నా శనార్తులు, దండాలు! గా దేవుని మీది బక్తీ మిమ్మల్ని గీడ్కి ఈడ్సుకొచ్చింది. గాదేవుణ్ణి సూడాలంటె ముందు మనం మన సుట్టూ సూస్కోవాలె! అంటే ముందుగాల మన ఇల్లు సూస్కోవాలె. తర్వాత మన మన్సు శుద్ధి జేస్కోవాలె. గిటు సూడండ్రి. గిదేంది? గిది రొట్టె! గిదే మనందర్కి పరమేశ్వరుడు. గిదే మనకు పైసా. గందుకే మనం ముందుగాల రొట్టెను సంపాదించే కోషిష్ చెయ్యాలె. దేవుడు కూడ గదే చెప్పుమన్నడు. “తిండి వుంటేనే కండ ఉంటది” అన్నడు. గీకాలంల తిండి దొర్కుడే కష్టమయ్యింది. మనం పంటలు బాగా పండించుకోవాలె. గీ రొట్టెల కోస్రమే లీడర్లు అమ్రీకా వగైరా దేశాలకు దొరకు పోతుౖను. కాని దేవుణ్ణి మర్సిపొయ్యిౖను. గందుకే మొన్న న్యాతిరి గాదేవుడు కలల కన్పిచ్చిండు. ఐదుగురిని జమచేసి గీ దునియాని ఉద్ధరిచ్చురా! అన్నడు. గందుకే నేనొచ్చిన. మనమొక సంగం బెడ్తం. దేశంల ఉన్న గరీబోళ్ళందర్కి “రోటీ కప్డా ఔర్ మకాన్” ఇయ్యాలని గవర్నమెంటును అడ్గుదం. ఇయ్యపోతే రాజీనామా చెయ్యమనాలె అని నేను అంటూంటే ఎవరో, “అహ్హా అహ్హా” అన్కుంట గట్టిగ నవ్విండు.

వాని ఎన్కనే మిగిలినోళ్ళంతా నవ్వుడు షురూ జేసిౖను. గవన్ని పట్టిచ్చుకోకుండా నేను నా లెచ్చర్ ఇస్తూనే ఉన్న. ఇగ నా మాటలు ఇనుడు వాళ్ళ వశం కాలె. ఎంటనే లేసిన సేత్లున్న కట్టె గుంజుకున్నరు. నేను నిలబడ్డ రాయికి అతుకున్నేటట్లు గొడ్డును బాదినట్లు బాదిౖను. కట్టె ఇరిగిపొయ్యింది. దాన్ని పారేసి ఎవ్వల్లతొవ్వ వాళ్ళు బట్టిౖను.

బాగ్యామ్ అంతా ఖామోషయ్యింది. మళ్ళ ఆసనాలేసేటోడు ఆసనాలేస్తున్నడు. సీమలకు శక్కరి ఏసేటోడు శక్కరి ఏస్తున్నడు. ముసలోల్లిద్దరు మల్ల ముచ్చట్లల్ల పడిపొయ్యిౖను. గాపిచ్చోడు సెట్ల మీదున్న పేర్లు చెక్కేస్తున్నడు. నా పెయ్యంతా పచ్చి పుండయ్యింది. మెల్లగ లేసి నీల్లుదాగుదమని చెర్వుకాడ్కి పొయ్యిన.

శానమంది చెర్వుల తానమాడి బైటికి వస్తుౖను. కొంతమంది ఆడోల్లు దొంగ సన్నాసి ముందలికెల్లి పోబట్టిౖను. గాసన్నాసి మెల్లంగ కండ్లు దెర్సి నాకెల్లి సూసిండు. వాని కండ్లు నా కండ్లు కల్సినై. వాడు ఎంటనే కండ్లు మూస్కోని నగిండు. వాన్కి నాల్గు తన్నాలన్పిచ్చింది. కుంటు కుంట బైల్దేరిన. ఒకల్ల మాట ఇనకపోతే నేను ఎట్ల బాగైతను. గాదేవుడేమో బాగ చెయ్యిర అన్నడు. నా మాటినేటోడు ఎవ్వలు లేకపోయిరి. గట్లనే సడక్‌మీదికెల్లి పోతుంటే రేడియోలో పాత సిన్మ పాట కవి ప్రదీప్ రాసింది రాబట్టింది. దేఖ్‌తెరే సన్సార్‌కి హాలత్ క్యా హోగయి భగవాన్! కిత్నా బదల్‌గయా ఇన్సాన్” అవును. నిజమే అన్కున్న. “రామ్‌భక్త్ రహీం కె బందే రచతే ఆజ్ ఫరేబ్ కె ధందే. ఇన్హీకె కాలే కర్‌తూతోఁసే హువా ఎ ముల్క్ మసాన్! కిత్నా బదల్‌గయా ఇన్‌సాన్”

‘వారెవ్వా! ఏం పాట రాసిందు’ సోలా ఆనా సహీ గున్నది అన్కుంట ఇంటి తొవ్వ బట్టిన.

---

# కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

“కుసుమ ధర్మన్న కళా పీఠం” సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

-సంపాదకులు

## విజేత

నవశకంలో నారీమణి విన్యాసం
తనను తాను గెలుచుకొని నిలబడ్డ
ఆత్మాభిమానం పౌరుషం చూపగల
అతివ అతిశయం అలవిగానిదే....
నవనీతంలా లాలిత్యం కూడినదై
నవశక్తి పుంజుకుంటూ ధైర్యముగా
అడుగులో అడుగు వేసుకుంటూ
తనకంటూ ఓ ప్రత్యేకతను చాటేలా...
ఉద్యోగ పర్వము సంసార సాగరం
చాకచక్యంగా వ్యవహరించి తానేంటో
నిలదొక్కుకున్న మహిళగా గుర్తింపు
నేటితరం అంతా దాసోహమయ్యేలా....
సజావుగా సాగేందుకు వీలుగా
కుటుంబ భారం తన భుజాలపై వేసుకుని
నడిపించే ప్రయత్నం చేస్తూ విజేతగా
సాధించే దిశగా ముందడుగు వేస్తోంది...

-వెంకటేశ్వర్లు లింగుట్ల
+91 94404 72254

## సబల

మజిలీల గజిబిజిలు ఎన్ని ఉన్నను
మ దమతిప్పక సాగేమహిళ బ్రతుకులు
మలుపులు మలుపులు లో
ఎన్ని కుదుపులున్నను
బ్రతుకు బరువును ఆశలతో తేలిక పరుస్తూ
ఆత్మవిశ్వాసాన్ని పూట చలముగా
తనలోనే తోడుకుంటూ
బరువు బాధ్యతలను భారమని ఎన్నడు భావించక
ఎవరో వచ్చి మోస్తారని
దించుతారని ఎదురు చూడక
అమ్మతనంలోనే
ఆదిపరాశక్తి తత్వాన్ని నింపుకొని
భారాన్ని దింపుకోక సాగే ఆడమనిషి అమ్మ
కుటుంబ భారాన్నంతా సంచిలో నింపుకొని
వారసత్వాన్ని భుజాల మీద మోసుకుంటూ
అలుపు సరిపోలేకుండా
సాగుతున్న బ్రతుకు బాటలు
ప్రతి అడుగులో బిడ్డలకోసం చేస్తున్న
త్యాగాలు వారి బంగారి భవిష్యత్తులు
దేవత అంటే అన్నారు అష్టలక్ష్మి స్వరూపం
కానీ ప్రతి అమ్మ అందుకు నిలువెత్తు సాక్ష్యం
చేయాలి మనమందరంచేయాలి
అమ్మకు సాష్టాంగ నమస్కారం

-పార్లపల్లి నాగేశ్వరమ్మ
+91 73869 99490

## విధివంచితులు

బురదలో పుట్టిన తామరలైనా
స్వచ్ఛమైన చిరునవ్వుల దీపాలు
కన్నవారు కరువై
చేరదీసేవారు లేని శాపగ్రస్తులు
వారే వీధి బాలలు....!
వారు రేపటి పౌరులు.
అమ్మ ఎవరో తెలియదు.
నాన్న ఎవరో తెలియదు.
ఒక విధంగా విధి వంచితులు.
అమ్మ లాలన, నాన్న లాలన లేదు.
అమ్మ చెప్పే కథలు,
నాన్న చెప్పే కథలు వినలేదు.
అమ్మతో నాన్నతో ఆటలాడలేదు.
తోబుట్టువులు అసలు తెలియదు.
కానీ వారు మట్టిలో మాణిక్యం కావచ్చు.
ఒక డాక్టర్, ఒక ఇంజనీర్,
ఒక ప్రొఫెసర్ ఎవరైనా కావచ్చు.
వారి మీద జాలి చూపించడం కాదు.
నిజమైన మనసుతో అభిమానించండి.
వీలైతే ఆదుకోండి.
వారి మనసును బాధ పెట్టవద్దు.

-షహనాజ్ బతుల్, 99484 91418

## ఆమె బహుముఖ ప్రజ్ఞాశాలి

ఆమె కానే కాదు ఫక్తుమహిళ
ఆమె బహుముఖప్రజ్ఞాశాలి
ఆమె అమ్మలగన్నయమ్మదుర్గ
తనబిడ్డలపాలిట అన్నపూర్ణ.
ఓర్పున భూదేవి ఆమె
కూర్పున అష్టలక్ష్మి ఆమె
ఊహల కవితా లక్ష్మి ఆమె
అన్నీకలగలసిన సాహిత్యలక్ష్మి.
సోదరులపాలిట ప్రేమైకసోదరి
కన్నవారకిప్రేమపంచుకూతురు
కామించు భర్తకు స్వర్ణసుందరి
సంపాదించు సహాయలక్ష్మి.
పిల్లలకు తండ్రికి వంతెనవలె
ఓర్పుసహనానికిపొంతనవలె
తనజోలికి వస్తే అపరకాళి
తనకు రారెవరూదేనిలోసాటి

- ప్రశాంతి రేవూరి
+91 98491 05171

## బహుముఖ ప్రజ్ఞశాలి

అమ్మ అంటేనే బహుముఖ ప్రజ్ఞశాలి ఈ సృష్టిలో
అమ్మతనం తోనే సంసారా నైపుణ్యాలను
అలవోకగా నేర్చుకొంటుంది
సమయపాలన ఖచ్చితంగా నిర్వహించడం
అమ్మ కే మాత్రం సాధ్యం
పిల్లల్ని బడికి వెళ్ళి వచ్చే సమయంలో
ఇంటి సరుకులు తెచ్చుకో వడం
ఇంటిని వస్త్రాలను శుభ్రం చేసుకోవడం
అనుకున్న సమయానికే అందరికీ ఆకలి దప్పులను తీర్చడం
ఒకే సమయంలో భిన్న పనులు చేయడం ఒక్క అమ్మకే సుసాధ్యమే
నాలుగు చేతులతో పని చేసే యోధురాలు
పిల్లల భవిష్యత్ ను తీర్చి దిద్దే నాయకురాలు
అత్తింటి కి లో అడుగు పెట్టిన క్షణం నుండే తన ఇష్టాలను అభిరుచులను మర్చిపోయి
వాళ్ళ ఇష్టా లను తనవే అనుకునే సాధు స్వభావిణి
ముందుచూపు గల ఆర్థిక మంత్రిణి
కుటుంబ వ్యవస్థకు మకుటం లేని మహారాణి

-చంద్రశేఖర్ ఘంటి
+91 91337 46835

---

# పిలగోడు కిట్టడి కతలు- ఆర్.సి.కృష్ణస్వామిరాజు

పుస్తక సమీక్షలు




ఆర్.సి. కృష్ణస్వామి రాజు '**పుత్తూరు పిలగోడు**'లో 32 కతలున్నాయి. చిన్నప్పటి చిన్నచిన్న అనుభవాలను, చిన్న చిన్న కథలుగా స్వచ్ఛమైన మట్టి వాసనతో గుబాళించేటట్టు సరదా కతలుగా తీర్చిదిద్దారు.

పత్రికా విలేఖరి బాధ్యత నుంచి ఎదిగిన కృష్ణస్వామి రాజీ ప్రౌఢ, బాల, ఆధ్యాత్మిక రచనలతో పాటు హాస్యకథలు, జ్ఞాపకాలు ఆధారంగా రాయడం, సంపుటి విశేషాంశం. పుట్టి పెరిగిన పల్లెను ప్రేమించే రచయిత, తన వూళ్లో మనుషులను గుర్తు చేసుకొంటూ '**కిట్టడు పిలగోడు**' కతలు నడిపించారు.

కిట్టడనే చిటికెనేలంత పిలగోడు, కథా నాయకునిగా, ఈ కతల్లో ఆ వూరోళ్లు చదువరుల చుట్టూ తిరుగాడుతారు. సరదా కథలు చెబుతూ '**కలుక్కుమని**' విరిగిన ఎముక ను సరిచేసే ఊరి నేపథ్యం నుంచి పుట్టుకొచ్చిన ఈ పిలగోడు కతలకు, స్థానీయ పరిమళంతో మానవీయ భావనలు స్పృశిస్తున్నాయి.

కథలకు పెట్టిన శీర్షికలు, చమత్కారంగా బొమ్మలు ఆకట్టుకొంటున్నాయి. ప్రతీ కథలో కిష్టడు, అమ్మ నారాయణమ్మ కథ నడిపిస్తారు.

ఆ వూర్లో వుండే మనుషుల్లో మంచి, చెడు యవహారాల కతలు, కృష్ణస్వామి రాజు హాస్య, వ్యంగ్య, ధోరణిలో కిట్టడి పూరోడిగా మనకు చెప్తారు.

టీవీలు, సినిమాలు, మొబైళ్ళూ, కంప్యూటర్‌లు రాజ్యం చేసే ఈ రోజులలో అతి తేలిక విషయాలను సంఘటనలుగా తీసుకొని మనల్ని భుజాలు తడుము కొనేటట్టు చదివింపచేయడం ఈ పుత్తూరు పిలగోడి రచనా నైపుణ్యం.

ఇక కతల జోలికి పోతే, గురువు గుండు రహస్యం దగ్గరి నుంచి సత్యవతక్క కలర్‌టీవీ సీరియల్ వరకు అన్ని కతలలో పిలగాడి పిల్లంగోడు వినపడుతుంది. కొంగున కట్టిన ఇంగువ మాదిరి ఏ చిన్న విషయమైనా సెకన్లలో ఊరు ఊరంతా ప్రాకిపోతుంది. నెమలిఫించం, పిల్లంగ్రోవి కిట్టడి చుట్టూ తిరిగిన పాత్రలలో అందం, చమత్కారం, హాస్యంతో పాటు ఛమక్కులు చురుక్కులు మెరుస్తాయి.

ఆర్.సి. కృష్ణస్వామిరాజు ఈ 13వ పుస్తకం కథలు, సంపుటిగా వెలుగుకి తెచ్చిన '**అచ్చంగా తెలుగు**' ప్రచురణ కర్తలు అభినందనీయులు.

**ప్రతులకు:**
ఆర్.సి.కృష్ణస్వామిరాజు
22-4-71, బ్యాంక్ ఎంప్లాయిస్ కాలనీ,
మంగళం రోడ్,
తిరుపతి-517 507
సెల్: 939366 2821





-జయసూర్య
సెల్:9440664610

## తాత్వికతతో పాటు..

# విలక్షణ అభివ్యక్తితో 'ఏటూరి' గారి కవిత్వం!

'రేపటి గీతం'తో సాహితీ లోకానికి కవిగా పరిచయమైన కవి ఏటూరి నాగేంద్రరావుగారు వృత్తి రీత్యా రైల్వే ఇంజనీరింగ్ విభాగంలో చేరి రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా మలుచుకున్నారు. **"కర్టెన్స్", "ఢమ రుక్స్", "మనిషి వాసన" "పువ్వులు సమ్మె చేస్తాయి"** వంటి రచనలతో సాహితీ రంగాన కవిగా తమకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని పదిల పరుచుకున్నారు. **"దగ్ధ పల్లవుల పాట"** పేరుతో ఓ దీర్ఘ కవితను రాసి అందరి దృష్టినాకర్షిం చారు. కవి బ్రతుకు లోతులకు అద్దం పట్టాలన్న ఆకాంక్షతో ముందుకు సాగుతున్న ఏటూరి నాగుంద్ర రావుగారు ఇప్పుడు **"అలా ఆగు కాసేపు"** కవితా సంపుటితో మన ముందు కొచ్చారు. తాత్వికతతో పాటు విలక్షణమైన అభివ్యక్తితో ఇందులోని కవితలన్నీ ముస్తాబై వచ్చాయి. కవి యొక్క సామాజిక చింతనను, లోకజ్ఞతను మోసుకొచ్చాయి. **"అర్భకుడి ఆక్రోశం- నవ్వులాటగా ఉంటుంది క్కడ.. ప్రాణం చివుక్కుమన్నా కిమ్మనకు!..** అంటూ **"అలా.. ఆగు, కాసేపు"** కవిత ద్వారా హితవు పలికారు. **"ఏలాగో ఆ జ్ఞాపకాలన్నింటినీ పక్కకి నెట్టేయ్"** అని సూచించారు. నీ త్యాగాల గురించి తెలుసుకునే అవసరం ఎవరికీ లేదిక్కడ! దేనికీ కోప్పడకు అని సలహానిచ్చారు. ఎంతైనా రక్త సంబంధం కదా నిన్ను నీవు మూడు భాగా లుగా విభజించు కొమ్మని కోరారు. ఏదీ నిన్ను ప్రశ్నించదు.. కొన్నిసార్లు తలవాల్చిన పూలను చూస్తూ వుండు.. నీలో చప్పుడు నీకే వినిపిస్తుందని పేర్కొన్నారు. నీ సర్వస్వాన్నీ ఆకాశాని కిచ్చేయ్ ఏ ఇసుకలోనూ నీ నీడ అడుగులు కనిపించవు అలా ఆగు కాసేపు ఈ రాత్రయినా మనసారా నిన్ను కౌగిలించుకోనీ అని ముగించారు.

తాత్వికతతో సాగిన ఈ కవితలో జ్ఞాపకాలను పక్కకు నెట్టి.. ముందుకు సాగాలని కోరారు. ముఖ్యంగా జీవన సంధ్యలో.. పండుటాకులుగా మారిన వృద్ధులను ఉద్దేశించి రాసినట్టుగా.. వృద్ధాప్యంలో గతం తాలుకూ త్యాగాలను.. చేసిన పనులను తలుచుకుని.. ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంఘటనలను చూస్తూ ఉండకూడదనీ.. హిత బోధచేశారు. తలవాల్చిన పూలను చూస్తూ ఉండు నీలో చప్పుడు నీకే వినిపిస్తుందని చెప్పడం బాగుంది.

**'ఎంత బాగుణ్ను'** కవితను ఏ కారణం చేతనో మనిషి లోలోపలే వొదిగి కూర్చున్నాడంటూ ప్రారంభించారు. ఎవ్వరికీ పక్కవాళ్ల ఉనికే పట్ట దనీ.. ప్రతివాడి ముఖ ఉపరితలం మీద దుఃఖాల కలవరింతలు అంటూ కొనసాగించారు. తమని తామే హత్య చేసుకునే వాళ్ల మధ్య నేనో కొత్త మనిషిని పరిచయం చేయాల నుకుంటున్నాను.

**సూటిగా! ముక్కు సూటిగా!**
**నా లోపల ఈ మనుషులు**
**సీతాకోక చిలుకలై**
**నా చుట్టూ ఎగిరితే ఎంత బాగుణ్ను** అంటూ ముగించారు. సమాజంలో మనుషుల దుఃఖాల కలవరింతలను.. వెన్ను పూసల్ని తెలిపే స్వార్థ చింతన గలవారిని కవితాత్మకంగా ప్రస్తావించారు.

**కోరికెప్పుడూ గొర్రెలు కాదు.. అబద్ధం కూడా అంతే!** అంటూ **"అస్తిత్వం"** కవితను ఎత్తుకున్నారు. జీవితం ముందు కోప్పడినందుకేమో.. నా అస్తిత్వాన్ని ప్రశ్నించిందని పేర్కొన్నారు. అన్నట్టు జీవితం అమాయ కురాలేం కాదు.. ఏ క్షణంలోనైనా.. తరంగ విలయం సృష్టించవచ్చునీ.. మనిషి మనిషికి మధ్య మమతల తీగల్ని దట్టంగా పెంచనూ వచ్చని ఆశావహ దృక్పథాన్ని ప్రకటించారు.

కన్నీటి తెరల్లో తర్కం కొట్టుకు పోతుదనీ.. రక్తం వానగా కురుస్తున్న నేపథ్యమనీ.. ఎక్కడో! నిశ్శబ్దం మాట్లాడుతోందనీ.. నేనింకా మనిషిననే నమ్మకం నాలో కొట్టుమిట్టాడుతుందంటూ కవి ఏటూరిగారు మరో కవితకు ఈ సంపుటిలో చోటు కల్పించారు.

కవి ఏటూరిగారు ఒకానొక రోజు బైక్ రైడర్‌లో ప్రయాణం చేసిన అనుభవాన్ని మనతో పంచుకుంటూ బైక్‌రైడర్ కవితకు జీవంపోశారు. బైక్ రైడర్‌లో ఉన్నప్పుడు తన గుండెలోంచి.. కోరికలన్నీ ఎగిరిపోయి నరనరాల్లో చీకటి అగాధం అని వ్యాఖ్యానించారు. ప్రతీ నిముషం నెత్తుర్ని శ్వాసించే వాడికి ప్రాణ మున్న ప్రతిదీ బంధువేనని తేల్చి చెప్పారు.

చరిత్రలో ఎప్పుడూ ప్రజలే విజయ సంతకం చేస్తారని తెలియజెబుతూ **"ఆడిట్"** కవితను రూపుదిద్దారు.

**"జీవితానికి ఆవల"** కవితలో కవి యొక్క తాత్వికతను చూడగలం.. నువ్వు తాత్విక గూళ్లను అల్లడం మొదలు పెట్టాక.. నీకు నువ్వు అపరిచితుడివనీ.. ఆగంతుకుడివనీ.. అందుకే.. దేన్నీ మనసులోకి ఒంపుకోకు ఖాళీ చేయడం చాలా కష్టమని పేర్కొన్నారు. బహుశా బంధానికి జీవితం ఇచ్చే నిర్వచనం బాధేమోనని అభిప్రా యపడ్డారు.







ప్రతులకు:
ఏటూరి నాగేంద్రరావు
సెల్:7416665323

ముఖ పుస్తక సమూహము ముందర అనంతమైన కవిత్వ పఠనం సాగుతోందనీ.. ప్రతిదీ విశ్వాసాన్ని కోల్పోయి రాకాసి నవ్వుల్ని పుక్కిలిస్తోం దంటూ **'చింతనామృతం'** కవితలో వ్యాఖ్యానించారు.

కవి ఏటూరిగారి కిత్వం నర్మగర్భంగా.. తాత్వికంగా.. ఎన్నో విషయాలు.. వాస్తవాలను తెలియజెబు తాయి.. లోతైన భావాలను అలతి అలతి పదాలతో తెలియజెప్పటంలో ఆయన దిట్ట..

**అలా సముద్రం దాకా నడిచి వెళు**

**నువ్వెప్పుడూ చూడని ప్రపంచాలు**
**తెరుచుకుంటాయనీ..**
**అలా రోడ్డు మీదికెళ్లి**
**ఎరుకైన వారిని పలకరించు!**
**పరిగెత్తుతున్న కాలం**
**క్షణికమే అని తెలస్తుంది.**
**నువ్వు నీ తోటని పూలను పలకరించు**
**నీవైపు నమ్మకంగా చూస్తాయనీ..**
**నీ కన్నీళ్లను ఎవరైనా తుడవాలని చూశావో**
**వేడెక్కిన తాపంతో**
**నీ గుండె కూరుకుపోతుందంటూ**

మరో కవితకు ఈ సంపుటిలో చోటు కల్పించారు. పరుగెత్తుతున్న కాలం క్షణికమని తేల్చి చెప్ప డం కోసం కవి చేసిన ప్రస్తావనలు ప్రశం సనీయం గా ఉన్నాయి. చిన్ని కవితలైనప్పటికీ పెద్ద సందేశాన్ని మోసుకొచ్చిన కవిత ఇది!

**'అనుకోని అతిథి"** కవితలో కవి యొక్క లోకజ్ఞతను చూస్తాం.. జీవితాన్ని తాత్వికంగా ఆవిష్కరిం చడాన్ని గమనిస్తాం. ఈ ప్రపంచంలో అవశేషాలతో తిరుగాడే మనుషుల మధ్య మృత్యువే ఎప్పటికీ అనుకోని అతిథి అని చెప్పడం కవి యొక్క కలం బలాన్ని సూచిస్తోంది. మృత్యువును అనుకోని అతిథిగా పేర్కొనడం.. కవి యొక్క సునిశిత పరిశీలనకు ఆలోచనలకు అద్దం పట్టేలా ఉంది.

**మనిషి పదార్థంలా మారాక**
**సమస్తమూ వ్యాపారమే!** అని వ్యాఖ్యానిస్తూ **"స్వరం"** కవితకు జీవం పోశారు. జీవితం కూడా సరైన యుద్ధమేనని.. ఛేదించలేకపో తున్న రహస్యమేనని.. నీ సుఖాల కోసం తాపత్రయ పడతావో కాలం కూడా స్వరం పెంచుతుందని తెలియ జెప్పారు. అంతేగాక అగాధాన్ని సృష్టించడం.. పూడ్చడమూ కాల మహిమే నని కవి విడమరిచి చెప్పారు.

అక్షరం ఎప్పుడూ అక్షయపాత్రే నంటూ **"జీవితానంతర నాటకం"** కవిత ద్వారా తెలిపారు. అక్షరం ఎడారి గుండెల్లోనూ సౌం దర్యం సృష్టిస్తుందనీ.. విడమరిచి వివరిం చారు. ఇంకా ఈ కవితలో..

**నువ్వు కట్టుకున్న ఈ కీర్తి సౌధం**
**కాల్పనికతే అని**
**ఎప్పుడు గుర్తిస్తావో!**
**ముసుగు వెనుక ముఖాన్ని**
**దాచుకోగలవేమో!**
**నిజాన్ని దర్శించడానికి మాత్రం**
**అనంతమైన హృదయం కావాలని**
**గదిలో ఉన్న ప్రతి వస్తువూ**
**నన్ను హెచ్చరిస్తుంటుందనీ..**

ద్వేషం ఎవరికీ ఆనందాన్ని ఇవ్వదని తేల్చి చెప్పారు. ఆనందంగా ఉండాలంటే ద్వేషాన్ని దరి చేరనీయ వద్దని.. మనం కట్టుకునే కీర్తి సౌధం కాల్పనికతేననీ.. వివరించారు. అనంతమైన హృదయంతో నిజాన్ని దర్శించమని హితవు పలికారు.

**మరణం యజ్ఞ కార్యక్రమమైనప్పుడు**
**యుద్ధం కూడా ఒక యజ్ఞమే** అంటూ కవి ఏటూరిగారు ఇంకొక కవితను ఇందులో పొందుపరిచారు.

ఏ దిక్కులేక.. కడుపు నింపుకోవడాని పడుపు వృత్తిని ఆశ్రయిం చిన అతివల వెతలకు అద్దం పడుతూ "వన్ మినిట్ ప్లీజ్" కవితను రాశారు.

**ఆమె నిర్జీవంగా ఉంది**
**మనిషి ఎదురుగా**
**మరో చావును చూస్తూ..**
**బ్రతకాలంటే..**
**పోరాటం చేయాలి..**
**అదెంత బాధాకరమో**
**దేహాంతర భాగాలకు తెలుసు**
**జీవితంలో నరకయాతేనని**
**ప్రత్యక్షంగా చూశాక**
**నా నవ్వు రోగాలు లేని**
**శరీరంలా ఉందని** కొనసాగించారు.

తప్పనిసరిగా పడుపు వృత్తిని ఎంచుకున్న అభాగ్యుల కష్టాలను అక్షరీకరించారు.

**"శవాసనం"** కవిత ఆర్ద్రంగా మలచబడింది.

**బాధ్యతల బరువు**
**నన్నెప్పుడూ నన్నుగా చూడలేదు.**
**నవ్వుతూ చేతుల్ని నరికేసింది..**
**రోజూ భయాల మధ్య**
**నా ఇంటికి నన్నే ఆగంతుకుడ్ని**
**చేసిందని వాపోయారు.**
**నవ్వడానికి కారణాలేమీ లేక**
**నాలో నేను నవ్వుకుంటాను**
**మెదడును చీకటి టెర్రస్ మీద**
**ఆరేసి..**
**మంచాన్ని కౌగిలించుకుంటాను**
**కళలేని చేతులతో..**

అంటూ రాసిన పంక్తులు అందరినీ కదిలిస్తాయి. జీవన చరమాంకంలోనైనా.. ఎప్పుడైనా సరే ఎవరికి వారు ఓ సారి నెమరేసుకుంటే కనిపించే దృశ్యాలివే కదా!

"బుక్ ఫెయిర్" కవితలో కవి ఏటూరిగారు రెక్కలు తెగిన అక్షరాలన్నీ ఎవరికో అరువిచ్చేసి కేకలతో, వ్యాపార బరువుని మోస్తుంటాయని వ్యాఖ్యానించారు. నిజమే కదా! రచయిత బుక్‌ఫెయిర్‌లో రాజసాన్ని కొనితెచ్చుకుని వ్యాపార బరువును మోస్తుంటాడు. దానికి తోడు చేసిన అప్పుల మోతతో తానో రచయితనన్న కిరీటం తగిలించుకుని తిరుగుతుంటే ఎవరికి వారు సమర్థవంతమైన పాత్రలను పోషిస్తుంటే ఆవిష్కరణలూ, కలబోతలూ వగైరా సంవత్సరం దాకా ఆశ, కీర్తి కాంక్ష రచయిత చుట్టూతా తిరిగి పిల్లి మొగ్గలేస్తాయన్న వాస్తవాన్ని కవి ఏటూరిగారు బుక్‌ఫెయిర్ ఈ సన్నివేశాలను ఈ కవితలో దృశ్యమానంచేస్తూ.. బుక్‌ఫెయిర్ తతంగాన్ని ఎండగట్టే ప్రయత్నం చేశారు. పెదవులకు తెలియని నవ్వుల్ని నవ్వుతూ.. రచయిత ఇంకోలా ఉండటానికి ఆరాటపడతాడనీ.. అంతా సజావుగా.. వున్నప్పటికీ రచయిత మన శ్శాంతినెవరో దొంగిలించేశారని.. ఆయన బ్రతుకు చుట్టూ హైటెక్ చిత్రహింసలుపై నాట్యం చేస్తుంటాయని పేర్కొంటూ కవి నడుస్తున్న చరిత్రకు అద్దం పట్టారు.

కవి ఏటూరిగారు ఇందలి చాలా కవితల్లో తాత్వికతతో పాటు విలక్షణమైన అభివ్యక్తితో తమ భావాలను ప్రకటించి పాఠకులను మెప్పించారు. లోతైన ఆలోచనలకు చోటు కల్పించారు. జీవితం రుచేమిటో పెదవుల్తోనయినా తాకావా! అగ్గిపెట్టెల అపార్టుమెంట్‌ల మధ్య ఒంటరిగా నీకు నీవే చీలి పోతుంటావని.. ఆకలి, ప్రేమ రుచులు మరిచిపోయి ఆత్మలు చిరిగిన మనుషుల మధ్య నిత్యం మరణిస్తూ నీ శవయాత్రను నువ్వే కలగంటావని **'శవయాత్ర'** కవితలో కవి వ్యక్తీకరించిన శైలి విలక్షణంగా ఉంది. **"నిస్సారం"** కవితలో బిడ్డా! నగరం పూర్తిగా నిస్సారమై పోయింది. **చీకటిని తడమకు, కూలిపోతావ్! భయంగా తలవాల్చకు! శలభంలా కాలిపోతావ్!** అంటూ హెచ్చరించారు. ఏదో ఒక రోజు ఆశ నీలోకి తొంగి చూస్తుందని ముగించారు.

**"మృత్యుకుహరం"** కవితలో నిజంగా మనల్ని మనం విప్పార్చి చూసుకుంటే.. అందరం మృత్యు కుహరంలో నడుస్తూ ఉంటామని పేర్కొన్నారు. ఏకాంత ఉద్వేగాల్ని ప్రేమించే ఒంటరితనం.. నేను అనే ప్రస్తావనను అధికం చేస్తుందన్న వాస్తవాన్ని వివరించారు.

నిజానికి.. ప్రతి మనిషి బాహ్య పోరాటం గాలి వాటమేనని తేల్చి చెబుతూ మరో కవితను ఈ సంపుటిలో పొందుపరిచారు. బృంద చర్చలూ, సహజ స్పందనలూ గాలివాటమేననీ.. తత్వదర్శనమూ గాలివాటమేనని.. నువ్వు గాలివాటమే.. నీవై వ్యాపించిన సర్వమూ అదాటున గాలివాటమే నొక్కి వక్కాణించారు.

**'నిర్వచనం'** కవితలో జీవించడాన్ని, మరణించడాన్ని సమానంగా చూసే నువ్వు.. నీ అంతరాత్మతో ఎ ప్పుడూ ఏకీభవించలేవనీ.. నీ జీవిత లో ఏ ప్రశ్నకైనా సంతోషకర సమాధానం ఉందా? అంటూ కవి తనకు తాను ప్రశ్నించుకున్నారు. దేన్నయినా అనుభవించడం సులభమే.. నిర్వచిం చడమే కష్టమని వ్యాఖ్యానించారు. పై కవితలే కాక చాలా కవితలు, కవితా పంక్తులెన్నో ఉదహరించడానికి యోగ్యంగా ఉన్నాయి. కవితల్ని ఒకటికి రెండుసార్లు చదివితే తప్ప.. కవి యొక్క భావాలను అవగాహన చేసుకోలేము.

కవిత్వపు లోతులను పట్టుకోలేము. తాత్వికత, విలక్షణ వ్యక్తీకరణ.. శిల్పంలో చతురత.. భావ ప్రకటనలో విజ్ఞత, శైలిలో తమకంటూ ఓ ప్రత్యేకతను పాటిస్తూ..కవి ఏటూరి నాగేంద్ర రావు తమ జీవిత అనుభవాన్ని రంగరించి.. బౌద్ధిక తాత్వికతా తిలకాన్ని అద్ది ఈ కవితల్ని మనకు అందించారు.

వారికి శుభాకాంక్షలు తెలియజేద్దాం. ఆయన తాత్విక ఆలోచనలకు అభినందనలు తెలియజేద్దాం.



**- దాస్యం సేనాధిపతి**
సెల్:9440525544

---



చిత్రకవిత నిర్వహణ: గోస్కుల శ్రీలత
అంశం: చిత్రకవిత (ఏకాకి జీవితం)
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1550వ రోజు 'చిత్రకవిత (ఏకాకి జీవితం)' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'చిత్రకవిత (ఏకాకి జీవితం)' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,9441046839







### మనుగడ

ఎంతమంది ఉన్నా
బతుకు ఒంటరిదే
వచ్చేది ఒక్కరే
పోయేది ఒక్కరే
బంధాలన్నీ
నిజాలు కావు
మాటలు
సాక్ష్యాలు కావు !.
మనుగడే ఒక శ్లేష
పెద్ద అబద్ధం
సర్వం పరమాత్మదే
ఆశల మోజులలో
కోకొల్లలు కోరికలు
జరిగినా జరగకపోయినా
మిగిలేది నిరాశ!
మనిషి ఆ సంగతిని
అబద్ధాన్ని ఆదరించి
జీవిస్తే
ఒంటరి కాక మరి ఏమిటి?
బ్రతకాలి కాలగతిలో
మితం దాటక ప్రవర్తించాలి
ఉచిత మార్గంలో
నడచుకుంటే
జీవిత సత్యం
ఆనందాల హేతువు!
సర్వం నాదనే భావన
సంక్లిష్ట పారమార్థికం
లేని ఆశల కోరలలో
చిక్కుకుంటే
చిక్కులుమయం!.
చిన్మయంతో
తన్మయత్వంతో
నామస్మరణ
నిలుపు
ప్రతి ఒక్కరినీ
ధీర,వీర చతురులుగా!
ఆశలు వద్దు
కోరికలు పెంచకు
తృప్తి జీవనం
నిరవధిక
సంతోషాలకు కారణం
బాహుపరాక్
బహుపరాక్
బహుపరాక్!!!.
**-కె.కె.తాయారు**

### జలమయం

ప్రతి చోటా జలమయం
చుక్క కూడా లేదు
గొంతు తడపడానికి
ముందు చూడు
వెనుక చూడు
ఎటు పక్కైనా
తిరిగి చూడు
అంతా జనమయం
స్వంత బంధుమయం.
సొంతవారే
ఐనా వింతవారు
చెంతనున్నా కాని
పొత్తు లేని వారు.
మిత్రులుగా కొందరు
బంధువులుగా కొందరు
పిల్లాజెల్లా
ఇంటి ఇల్లాలూ
అంతా మనవారనుకున్నా
తీరు తెన్ను లేని
తిత్తిరి పక్షులు
తీరుబడిలేని
రెక్కల పురుగులు.
చెంతచేరి
చింతలను
పంచుకోనీయరు
అవసరాల కొరకే
అనుబంధాలని
వింత వింత
సాంగత్యాల
స్వంతవారిని విస్మరించి
విలాస వినోదాల
ఖుషీ ఆటలు.
వీటికి తోడు
చరవాణులు
స్త్రీ పురుష ఆకర్షణల
వయసు మైకాలు
బజారుమోజులో
అక్కరలేని కొనుగోలుదారులు
అందరూ ఉన్నా
ఒంటరితనం
పెనుభూతమై
వ్యక్తిత్వాన్ని
కుచింపచేసే
ప్రారబ్ధాల వైఖరి
నేటి సంఘీభావాల
పరిస్థితి.
ఏం సంపాదించేవనేది
ప్రశ్న కాదు
ఎంతమంది తోడుగా
ఉన్నారనేది
ఉచితమైన విశ్లేషణ
సముచిత సమాధానం.
**-రాజప్ప**

### కలిసి మెలిసుంటేనే మహాసుఖం

మాటల్లో
జగమంత కుటుంబం
చేతల్లో
ఏకాకి జీవితం
సెల్లు సొల్లుతో
జీవన గమనం
ఎవరికి వారే
యమునా తీరే
చచ్చినా బతికినా
ఒంటరియే విఠల!.
చిత్ర విచిత్ర ప్రవర్తనలు
రోజు రోజుకెన్నో పరివర్తనలు
ముందెనక
నటనలుబినర్తనలు
పొంతన లేని
పలు ఆవర్తనలు
మాట మనసు
చంచలమే విఠల!.
పొరుగువాడే పరాయివాడాయెగా
ఇంటి మనిషేమో దూరమాయెగా
సుదూరం కరిగి
తరిగి పోయెగా
హృదయమేమో
కురచే ఆయెగా
నీకు నీవే మిత్రుడవు
శత్రువు విఠల!.
పైపై మెరుగులపై
మోజు పెరిగె
మనిషి మనిషికి
బంధం తరిగె
మానవత
మంచితనమే కరిగె
సౌభ్రాతృత్వం
ముక్కలై విరిగె
కలల్లో విహారం
ఇలలో విషాదం విఠల!.
నేను నాదనేదే
నేడు వేదమైంది
గీత గీసుండడం గీతాసారమైంది
రంకు బొంకులే రామాయణమైంది
బాధ్యతారాహిత్యం భారతమైంది
సెల్లే సర్వస్వం
ఇల్లే నరకమైంది విఠల!.
మనుషులతో
దూరమవడం శాపం
బతుక్కి వినాశం
తప్పుదు పరితాపం
చెయ్ ప్రాయశ్చిత్తం
పడాలి పశ్చాత్తాపం
స్నేహం
జీవితానికి
వెలుగు దీపం
కలిసి మెలిసుంటేనే
మహాసుఖం విఠల!.
**-కాటేగారు పాండురంగ విఠల్**

### జీవన ప్రయాణం

ఓ మనిషీ!
నీవెవరు - నేను ఎందుకు
అంటే
సంబంధాన్ని చెప్తే
వీళ్లు నవ్వుతారు.
పుట్టేటప్పుడు - పోయే టప్పుడు
ఒంటరే కాదంటే
వీళ్లు కొప్పడుతారు,
జీవనానికి జీవితానికి
రూపం కల్పిస్తే
వీళ్లు ససేమిరా ఒప్పుకోరు!.
ఆలోచనకి ఆచరణకు
అర్థం చెప్తే
వీళ్లే అపార్థం చేసుకుంటారు.
ప్రయత్నానికి - ఆసక్తికి
సామ్యం చూపితే
వీళ్లు
నామీద కసురుకుంటారు.
నాకు తెలుసు
ఎదో పోగొట్టుకున్నావని
నేననుకుంటే
ఒంటరి అయ్యావని చూపిస్తే
నమ్మక ఆడిపోసుకుంటారు.
నేను ఎంత అరిచినా
నన్ను లెక్క చేయనంటారు!.
ఓ మనిషీ!
ఒంటరి ఎవరు ?
అసలు నీవెవరు ?
తెలుసుకోక
పరుగులు తీస్తే
పిరికి వాడనుకుంటారు
పిచ్చి వెధవని
వేలెత్తి చూపిస్తారు
నాకు తెలుసు
నిన్ను అన్నవాళ్ళే
ఆశ్చర్యపోతారు
నేననుకుంటా
నీ భాధని అర్థం
చేసుకుంటాడు
పుట్టించినవాడు.
ఓ మనిషీ!
నీవు ఒంటరి కాదు
నాకా భయం లేదు
ఆత్మస్థైర్యం తో
పాటుపాడు
ఒంటరియై
విజయం సాధించు
నా పాటకి
కోరస్ అయి నినదించు.
**-గుండవరం కొండల్ రావు**

### చివరకు మిగిలేది

చివరకు మిగిలేదేమిటని
ప్రతి దానికీ లెక్కలేస్తూపోతే
ఏ పనీ మొదలెట్టలేం!.
ప్రతి విషయాన్నీ
అర్థంతో ముడివేస్తే
బంధాలు, అనుబంధాలకు
మిగిలే విలువ శూన్యం!.
ఎంత నిబద్ధతతో
నిజాయితీతో పని చేశామన్నదే
అసలు లెక్క!.
ఫలితం గురించి ఆలోచించి
ఆందోళన పడటం కన్నా
మిన్నకుండడం మేలు..
ప్రయత్నాన్ని బట్టే ఫలితం!.
చివరాఖరికి
నేనొక్కడినే అనుకొంటూ
ఏ బంధాలు
అనుబంధాలకు లోబడక
నిస్తేజంగా
నిస్సారంగా జీవితం గడిపితే?!.
ఏ జీవికైనా
మనుగడే ముఖ్యం!
అత్యుత్తమ మానవ జన్మను
అర్థవంతంగా
ఆదర్శవంతంగా ముగిస్తేనే
అందం... ఆనందం!
అర్థం... పరమార్థం!
అప్పుడే చివరకు నీ వెంట
నలుగురైనా..
నలభైమందైనా!.
నేనొక్కడినే అనుకొంటూ
అహంభావంతో విర్రవీగితే..
నిన్ను
తలచుకునే వారిలో కూడా
నీవొక్కడివే!.
**-చంద్రకళ దీకొండ**

### నవజీవన శైలి

విశ్వమంతా
వసుదైక కుటుంబ భావన
స్వార్థసంకుచిత భావనలో
నేటి సమాజం
చుట్టూ ఎందరున్నా
ఏకాకి జీవితం మనిషిది
సముద్రమున్నా
దాహం తీరే దారేది
చుట్టూరా జనమెంతున్నా
ఎవరికి వారే యమునాతీరే.
పక్కన ఎవరున్నా
పట్టించుకోని వైనం
చరవాణి చెంతనుంటే
ఎవరి అవసరమెందుకు!
బతుకు బాటలో సమిష్టి కృషి
మరిచె మనిషి
పదిమంది కలిసి జీవిస్తున్నా
ఎవరికి వారుగా
కేంద్రక కుటుంబాల నేపథ్యంలో
ఉమ్మడి కుటుంబాల విచ్ఛిత్తి
ఊరుమ్మడి బతుకులకు మంగళం
పక్కింటి వారితో కొరవడిన సంబంధాలు
అహం పెరిగిన ఇహం
వలసల సలసలలో
స్వతంత్ర జీవనం.
జాతి మతమన్నది
నేడు పట్టనితనం
సంపాదనలో సగటు మనిషి
ఇల్లూ వాకిలి
తలిదండ్రులను వదలేసిన వైనం
స్వదేశం విదేశమనే భావన
మరచిన నవజీవన శైలి.
**- లక్ష్మారెడ్డి పసుల**

### దైవోపహతుడు

జగమంత కుటుంబంలో ఏకాకి
దైవోపహతుడు
ఆధునిక కర్ణుడు
ఊరూపేరూ లేని ఒంటరి పసివాడ్ని
అనాథశరణాలయంలో
బైట పడేసి పరారు
ఊయల్లోవేసి
శిశువిహార్లో పెరిగిన
అనాథ సాధించాడు డిగ్రీ.
నానా రకాల రూల్స్ తో
దత్తత ఇవ్వని సంస్థల కాలంలో
ఉద్యోగం వేటలో అలసి
వయ్యారి వగలు
సెగలకు శలభం.
సైబర్ నేరాలకు తలొగ్గనివాడు
గుండెలపై తన్ని పరారైన
నయవంచకి వలలో
గిలగిల
కరువులో అధికమాసంలా
ఉద్యోగం పోయి
కూడబెట్టిన సొమ్ముకరిగి
చెప్పులరిగి
"నన్ను నన్నుగా ప్రేమించే
నాకోసమే
కన్నీరు నింపే తోడులేరా?"
అని మాదకద్రవ్యాల గంజాయి
దందాలో
మత్తులో తేలుతున్న కళ్లు కాళ్లు
కాకులగుంపు కాకా అని చస్తే
చుట్టూ మూగుతాయి
కోతి గుంపులో ఎగురుతూ దూకుతూ
ఆనందం కరువు.
ఎవడిగోల
ఎవరి ప్రపంచం వారిది
బాల్యపు నవ్వులు
అమ్మ నాన్నల ప్రేమ లేక
చరవాణిని జేబుదొంగ కొట్టేస్తే
బతుకు తెరువు
అర్థం పరమార్థం తెలీక
శ్లేష్మంలో ఈగలా
కుడితిలో ఎలుక లా
సాలెగూటిలో కీటకపు బతుకు
ముక్కలైన మనసుకి ఏదీ ముగింపు?
వాడిన పూవు వికసించేనా?
జవాబులేని ప్రశ్న!?.
**-ఎ.రాజ్యశ్రీ**

### ఎవరికి వారే యమునా తీరే

సాంకేతికంగా పెరిగి
మొబైల్ వచ్చి
ప్రజలలో మొబైల్ పిచ్చి పెరిగి,
ప్రేమాభిమానాలు చచ్చి
మానవత్వం, సంస్కారం చచ్చి
ఎందరున్నా, ఎక్కడ ఉన్నా
మొబైల్ లోకంగా
ఎవరికి వారే యమునా తీరే లాగా
అరచేతిలో ప్రపంచం
చూస్తున్నారుగా
ఆకలి ఉండదు
దాహం ఉండదు.
నిన్ను చూస్తుంటే అనుకుంటూ
బాధ్యతలను మరిచి,
పనులను వాయిదా వేసి
చదువును మర్చిపోయి
కబుర్లు మర్చిపోయి
స్నేహితులను మర్చిపోయి
నువ్వే నా నేస్తం అంటూ
మొబైల్ తో స్నేహం చేస్తూ
అన్ని బంధాలను తెంచుకుంటూ
ఐకమత్యమే మహాబలం
అన్నది మర్చిపోయి
మొబైల్ లోకంలో
అందరి విహారం.
**-డాక్టర్ షహనాజ్ బతుల్**

### ఏకాకి

బంధాలకు భారమై
ఆత్మీయతకు దూరమై
ఏకాకితనానికి
దగ్గరయ్యావా తమ్మీ!!.
నాయనా!
డబ్బుకు దాసోహం అందరూ
డబ్బుంటే బంధువులు
పిలువక పోయిన వచ్చిచేరుతారు
కుప్పలుగా
ఉత్తుత్తి మాటలు చెప్పి
ఉట్టికెక్కిస్తారు
అందిన కాడికి దోచుకొని
అవతల పడతారు!!.
అరె తమ్మీ!
భ్రమలో జీవించావు
బతుకంతా ధారపోసి
బంధాన్ని ప్రేమించావు
ఆకలి తెలియకుండా
వండి వడ్డించావు
ఆనందాలను దోచుకొని
తిన్నింటి వాసాలు లెక్కబెట్టి పోతే
నడి వీదిలో నిలబడ్డావా ఏకాకిగా!!.
గుంపును వీడిన పక్షివయ్యావు
అందరున్నా అనాథవయ్యావు!!
ఎవరికి వారే యమునా తీరే
సెల్ ఫోన్తో ముచ్చట్లు
కంటిచూతో సైగలు !!
వ్యక్తిత్వం కోల్పోతున్నా
వ్యవస్థ బాధ్యత లేని మనుషులు
మానవ సంబంధాలు మరిచి
స్వార్థంతో చేస్తున్నారు నివాసం!!.
కురులు విరబోసిన కాంతలు
సంచిలో సిగ్గులు
చిన్నారుల చిరు నవ్వులు
దారులను చూపుతున్న జంట
కోయిలలు!! ముద్దు మురిపాలతో
జంట పావురాలు గుస గుస
ఊసులతో రోడ్డు ప్రయాణం!!
ఒంటరి బతుకుని
వెంటేసుకుని నువ్వు.
ఏకాకిగా మిగిలావు
దారిని దాపు చేసుకొని
పో ముందుకు!!
కదలకుండా నిలబడితే
తొక్కుకుంట పోతారు
జాలిలేని జనం!!.
నీ వాళ్ళు లేరు
నా వాళ్ళు లేరు
డబ్బు లేకుంటే అంతా పరాయి !
వాళ్ళేమిటో తెలుసుకో ముందు!!
**-పొన్నాల ధనమ్మ**

### పక్కలో పడుకున్న కట్లపాము

గుంపులో గోవిందంలా
మంది మధ్యలో మనమున్నా
సాంకేతికత కనుసన్నల్లో
సంధి కొడుతున్నది
మనిషి తత్వం.
పారిశ్రామికీకతలతో
పరుగు లంఘించుకున్నాక
వెనుతిరిగి
చూసుకున్నదిలేదు సాంకేతికత
కనుసన్నల్లోకొచ్చాక
లోయలో
పడ్డట్టయ్యింది.
ఇంటిలోకి
ఇడియట్ బాక్స్
వచ్చాక మొదలైంది
మెల్లగా
చేతిలోకి
స్మార్ట్ ఫోను వచ్చాక
చెవుల్లోకి
దూది ప్లగ్గులు వచ్చాక
చుక్కలు చూపిస్తున్నది
చల్లగా.
ఆత్మీయతలు అటకెక్కాయి
అనురాగాలు కొండెక్కాయి
అనుబంధాలు చెల్లాచెదురయ్యాయి
మొత్తంగా మానవత్వం నశించింది.
దేశభక్తి లేని
పాలకుల స్వార్థాలతో
పిల్లికి చెలగాటం
ఎలుకకు
ప్రాణసంకటంలా
శ్వాస లేని
జీవచ్ఛవంలా
ప్రజలకు మిగిలింది చెలగాటం.
కట్టుబాటు లేని
సోషల్ మీడియాలతో
కంటిమీద
కునుకు కరువై
పరిమితులులేని
యాపులతో
పరిధిదాటి
ప్రవర్తిస్తున్నది
పక్కలో పడుకున్న కట్లపాములా
పంచప్రాణాలు
తోడేస్తున్నది.
**-నగునూరి రాజన్న**

